ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
గురువారం 4 జనవరి 2024



బాపట్ల కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌ను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి



నిరసనాగ్రహం

డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టిన ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. మూడు వారాల నుంచి సమ్మె చేస్తున్న అంగన్ వాడీ లు బుధవారం కలెక్టరేట్ల ముట్టడికి పిలుపిచ్చారు. పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించినా అంగన్‌వాడీలు కలెక్టరేట్ల ముట్టడి ని జయప్రదం చేశారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి అంగన్ వాడీలు జిల్లా కేంద్రాలకు చేరుకోవడంతో రహదారులన్నీ ఆందోళన కారులతో నిండిపోయాయి. వందల సంఖ్యలో పోలీసులతో కలెక్టరేట్ల దగ్గర పహారా పెట్టి భయానక వాతావరణాన్ని ప్రభుత్వం సృష్టించినా అంగన్‌వాడీలు తగ్గలేదు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో కలెక్టరేట్ ప్రాంతాలు హోరెత్తాయి. పారిశుధ్య కార్మికులు, ఉపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగులు ఎక్కడికక్కడ ఆందోళనలను కొనసాగించారు.

- ఆందోళనలతో అట్టుడికిన బాపట్ల
- కలెక్టరేట్‌ను ముట్టడించిన అంగన్‌వాడీలు
- ఆర్డీవో కార్యాలయంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా
- యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల 12 గంటల ధర్నా
- ఎక్కడికక్కడ మున్సిపల్ కార్మికుల సమ్మె, ప్రదర్శనలు



గుంటూరులో కలెక్టరేట్ ముట్టడిలో సొమ్మసిల్లి పడిపోయిన అంగన్‌వాడీ కార్యకర్త



కార్యకర్తను అంబులెన్స్‌లోకి తీసుకువెళుతూ...



గుంటూరు కలెక్టరేట్ వద్ద రోడ్డుపై పడుకుని ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

బాపట్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులు బుధవారం పెద్దఎత్తున ఆందోళన చేశారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ ప్రదర్శనలు నిర్వహించారు. కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం, ధర్నా చౌక్ వద్ద ఆందోళనలు చేశారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరిని తీవ్రంగా ఖండించారు. తమ డిమాండ్లను నెరవేర్చేదాకా ఆందోళనలు విరమించేది లేదని స్పష్టం చేశారు. ఆయా వర్గాల ఆందోళనలతో బాపట్ల దద్దరిల్లింది. అడుగడుగునా పోలీసు ఆంక్షలతో నిర్బంధించినా కలెక్టరేట్ ముట్టడికి అంగన్‌వాడీలు కదం తొక్కారు. తమ డిమాండ్ల సాధన కోసం మూడు వారాల నుంచి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు బుధవారం కలెక్టరేట్ ముట్టడికి పిలుపిచ్చారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో పోలీసులు కలెక్టరేట్‌కు వెళ్లే అన్ని దారులను తమ అదుపులోకి తీసుకున్నారు. పదుల సంఖ్యలో ఖాకీలు మొహరించి వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వెళ్లే వారిని సైతం అడ్డుకున్నారు. ఇన్ని ఆంక్షలు పెట్టిన అంగన్‌వాడీలు భారీ సంఖ్యలో కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి అంగన్‌వాడీలు బాపట్లకు చేరు కోవడంతో రహదారులన్నీ వారితో నిండిపోయాయి. పారిశుధ్య కార్మికులు, ఉపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, మున్సిపాలిటీ ఇంజనీరింగ్ ఉద్యోగుల ఆందోళనలతోబాపట్ల పట్టణం నిరసనలతో హోరెత్తింది.

ఆంక్షలను ఛేదించుకుని..

జిల్లాలోని నలుమూలల నుంచి అంగన్‌వాడీలు కలెక్టరేట్ గేటు వద్దకు ఉదయం నుంచే చేరుకోవడం మొదలుపెట్టారు. విపరీతమైన ఆంక్షలు పెట్టినప్పటికీ వాటిని ఛేదించుకుని అంగన్‌వాడీలు కలెక్టరేట్ వద్దకు భారీగా చేరుకున్నారు. ప్రభుత్వం తమకు చేసిన మోసాన్ని పాటలు పాడుతూ నిరసన వ్యక్తం చేశారు. పోలీసులను దాటుకుని కలెక్టరేట్‌లోకి చొచ్చుకువెళ్లే ప్రయత్నాన్ని అంగన్‌వాడీలు చేయగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఒక దశలో పోలీసులకు, అంగన్‌వాడీలకు మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై అంగన్‌వాడీలు మండిపడ్డారు. హామీల అమలుపై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలన్న నినాదాలతో కలెక్టరేట్ దద్దరిల్లింది. విధుల్లో చేరకపోతే తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడితే బెదిరిపోమని అంగన్ వాడీలు స్పష్టం చేశారు. తమను తొలగించాలనుకుంటే చూస్తూ ఊరుకునేది లేదని, ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని ప్రకటించారు.

ప్రభుత్వం మోసం చేసింది : పారిశుధ్య కార్మికులు

కనీస వేతనాలు అమలు చేయకుండా ప్రభుత్వం తమను మోసం చేసిందని మున్సిపాలిటీలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు బుధవారం సమ్మె కొనసాగించారు. మున్సిపాలిటీ ఎదుట ధర్నా నిర్వహించి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. వీరి సమ్మెకు మద్దతు తెలుపుతూ మున్సిపాలిటీ ఇంజనీరింగ్ సిబ్బంది ప్రదర్శన చేశారు. వేతనాలు పెంచి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.



బాపట్ల మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, పారిశుధ్య కార్మికులు

యూటీఎఫ్ పన్నెండు గంటల దీక్ష...

పీఆర్‌సీ, డీఏ బకాయిలు చెల్లించకుండా ఉద్యోగులకు వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేసిందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిల ను వెంటనే చెల్లించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో పన్నెండు గంటల దీక్ష చేపట్టారు.



బాపట్లలో వంటావార్పు చేస్తున్న యూటీఎఫ్ ఉపాధ్యాయులు



బాపట్ల కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్రాధ్యక్షుడు వెంకటేశ్వర్లు

సమగ్ర శిక్షా అభయాన్ ఉద్యోగుల నిరసన

తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం పదిహేనో రోజుకు చేరుకుంది. ఉద్యోగులు మోకాళ్లపై నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తమను మోసం చేసిందని, రెండు వారాలకు పైగా సమ్మె చేసున్నా, పాలకులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు.



సమస్యలు పరిష్కరించాలని రేపల్లె ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు, ఏఐటీయూసీ నాయకులు



బాపట్ల : మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మెకు మద్దతుగా ప్రదర్శన చేస్తున్న ఇంజనీరింగ్, వాటర్ స్కీమ్ వర్కర్స్



కర్లపాలెం పిట్ల వేణుగోపాలరెడ్డికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు నాయుడు

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన చంద్రబాబు

టీడీపీలోకి కర్లపాలెం జడ్పీటీసీ

బాపట్ల, జనవరి 3: అందరూ ఊహించినట్లే కర్లపాలెం వైసీపీ జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి టీడీపీ కండువా కప్పుకున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో ఆయన అనుచరులతో కలిసి బుధవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. వేణుగోపాలరెడ్డితోపాటు వైసీపీ ముఖ్యనాయకులు యారం ప్రసాద్, షేక్ కాలేషా, డి.కృష్ణమూర్తిరాజు, పృథ్వీరాజు, వెంకటేశ్వరరాజు తదితరులకు చంద్రబాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు విజన్ రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. వైసీపీ పాలనలో అనేక అరాచకాలు జరుగుతున్నాయని రాజ్యాంగ విలువలు హరిస్తున్నారని, స్థానికంగా సముచిత స్థానం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని అందుకే టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు. టీడీపీ గెలుపు కోసం పనిచేస్తామని నరేంద్రవర్మను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని చెప్పారు. వైసీపీ పాలనలో అరాచకాలు ఎక్కువ అవ్వడంతో వైసీపీ శ్రేణులంతా టీడీపీలోకి వస్తున్నారని నరేంద్రవర్మ తెలిపారు. బాపట్లలోని వైసీపీ నాయకులు దోచుకోవటం, దాచుకోవటం పనిలో ఉన్నారన్నారు. ప్రజా సంక్షేమం వారికి పట్టదన్నారు.

ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమం

- రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరం
- ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సభలో ఎమ్మెల్యేలు ఏలూరి, అనగాని
- టీడీపీ, జనసేన శ్రేణులు కలిసి నడవాలని మాజీ మంత్రి ఆనందబాబు పిలుపు



పెదపులివర్రులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు అనగాని, ఏలూరి, మాజీ మంత్రి ఆనందబాబు

భట్టిప్రోలు, జనవరి 3: అరాచక పాలనను అంతమొందించేందుకు ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని పెదపులివర్రు గ్రామంలో ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మగౌరవాన్ని నలుదిశలా చాటిచెప్పిన ఎన్టీఆర్ తెలుగు వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే ఉంటారన్నారు. రాష్ట్రానికి ముందు చూపు కలిగిన చంద్రబాబు నాయకత్వం అవసరమని తెలిపారు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా రాష్ట్ర భవిష్యత్ అంధకారంలోకి వెళ్తుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయ సాధనకు చంద్రబాబు కట్టుబడి పని చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలకు రూపకర్త ఎన్టీఆర్ కాగా, అభివృద్ధి - సంక్షేమం రెండు కళ్లులా చంద్రబాబు పాలన చేశారన్నారు. అధికారం పోతే జగన్‌రెడ్డి ప్రజల్లో ఉండలేడని తెలిపారు. మూడు ఎమ్మెల్సీ స్థానాలు టీడీపీ కైవసం చేసుకున్న దగ్గర నుంచి జగన్‌రెడ్డి ఓటమి భయంతో ఉన్నారన్నారు. జనసేన, టీడీపీ పొత్తుతో క్లీన్‌స్వీప్ చేయబోతున్నామన్నారు. టీడీపీ, జనసేన శ్రేణులు కలిసి నడవాలని పిలుపు ఇచ్చారు. తొలుత వెల్లటూరు నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి అనగాని, రంగా విగ్రహానికి ఆనందబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తారక రామా ఫౌండేషన్ సభ్యులు అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, మండల కన్వీనర్ వాకా శేషబాబు, నాయకులు మైనేని మురళీకృష్ణ, కనగాల మధుసూదనప్రసాద్, వేములపల్లి జగన్నాథరావు, నూతక్కి దినకర్‌బాబు, మోటూరు పుణ్యశ్రీనివాసరావు, జంపని వీరయ్య, జి. శ్రీనివాసరావు, కొసరాజు సతీష్, కంఠంనేని పసి, నక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

ప్రొటోకాల్.. పట్టదంతే

- పదేపదే ఉల్లంఘన.. మారని అధికారుల తీరు
- వైసీపీ ఇన్‌చార్జి అశోక్‌బాబు ద్వారా పింఛన్ల పంపిణీ



వేమూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్నవైసీపీ ఇన్‌చార్జి అశోక్‌బాబు

వేమూరు, జనవరి 3: ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు ప్రొటోకాల్ ఉంటుంది. ఆ ప్రకారం ప్రజా ప్రతినిధుల ద్వారా ఆయా కార్యక్రమాలను అధికారులు నిర్వహించాలి. కాని మండలంలో ప్రొటోకాల్‌ను అధికారులు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. గత కొన్ని రోజులుగా అధికారులు ప్రొటోకాల్ నిబంధనలను పట్టించుకోకుండా ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వైసీపీ సమన్వయ కర్తలను నియమించినప్పటి నుంచి ప్రొటోకాల్‌కు విరుద్ధంగా జిల్లాలో కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఎటువంటి ప్రభుత్వ పదవి లేకపోయినా వైసీపీ సమన్వయకర్తలతో అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహింపచేస్తుండటంపై ప్రజల నుంచి పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి. వేమూరు మండలంలో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ విషయంలో అధికారులు ప్రొటోకాల్‌ను ధిక్కరిస్తున్నారు. గత నెల 26న ఆడుదాం ఆంధ్ర ప్రభుత్వ కార్యక్రమానికి వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబును ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఆయన చేతుల మీదగా క్రీడలను ప్రారంభింప చేసి క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేయించారు. దీనిపై అనేక విమర్శలు వచ్చినా అధికారులు పట్టించుకోలేదు. పైగా బుధవారం ప్రభుత్వ పరమైన కార్యక్రమం పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి కూడా అశోక్‌బాబును ఆహ్వానించి పంపిణీ చేయించారు. అశోక్‌బాబు ప్రజాప్రతినిధిగా ఎంపిక కాలేదు కేవలం పార్టీ పదవి మాత్రమే ఉంది. ఎమ్మెల్యే స్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడంపై ప్రజలు, ప్రతిపక్షాలు అనేక రకాలుగా విమర్శిస్తున్నాయి. ప్రొటోకాల్ ఉల్లంఘించి ఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరిస్తున్న అధికారులపై ఫిర్యాదు చేస్తామని టీడీపీ నాయకులు తెలిపారు.

దిక్సూచి DIKSUCHI

ఇఫ్లూలో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)కి చెందిన నాన్ ఫార్మల్ కోర్సెస్ అండ్ రిసోర్సెస్(ఎన్ఎఫ్‌సీఏఆర్) విభాగం- ప్రొఫిషియెన్సీ కోర్స్ ఇన్ ఇంగ్లీష్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సు వ్యవధి 40 గంటలు. ఇందులో ప్రధానంగా ఇంగ్లీష్‌కు సంబంధించి రిటెన్, స్పోకెన్ స్కిల్స్ నేర్పిస్తారు. ఫిబ్రవరి 5 నుంచి మార్చి 1 వరకు నాలుగు వారాలు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. రోజుకు రెండు గంటలు చొప్పున వారానికి అయిదు రోజులు తరగతులు ఉంటాయి. మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్‌కు సంబంధించి లిజనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్ వంటి కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పిస్తారు. మొదటి వారంలో ఇంట్ర డక్షన్స్, డిస్క్రిప్షన్, నరేషన్, ప్లానింగ్; రెండో వారంలో ఎక్స్‌ప్లయినింగ్, ఇన్‌ఫార్మింగ్, ఇన్‌స్ట్రక్టింగ్/డైరెక్టింగ్, రెస్పాండింగ్; మూడో వారంలో ఎక్స్‌ప్రెసింగ్ ఒపీనియన్, గ్రూప్ డిస్కషన్, నోట్ టేకింగ్, సమ్మ రైజింగ్, ఫార్మల్ లెటర్ రైటింగ్; నాలుగో వారంలో సీవీ అండ్ అప్లికేషన్, లెటర్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, అఫీషియల్ రైటింగ్ తరగతులు ఉంటాయి. కోర్సుకు సంబంధించిన మెటీరియల్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కాలేజీ నుంచి ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. విదేశీ విద్యా ర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- **కోర్సు ఫీజు:** భారతీయ విద్యార్థులకు రూ.2,500; విదేశీ విద్యార్థులకు రూ.5,000; ఇఫ్లూలో చదువుతున్న విదేశీ విద్యార్థులకు రూ.4,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- దరఖాస్తు ఫారాలను జనవరి 19 వరకు ఇస్తారు.
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జనవరి 31
- **ఫోన్ నెం.** 040 27689646
- **వెబ్‌సైట్:** efluniversity.ac.in

ఐఐఎం కాశీపూర్‌లో ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ(అనలిటిక్స్)

కాశీపూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)- వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ఉద్దేశించిన ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ(అనలిటిక్స్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆరు టర్మ్‌లు ఉంటాయి. వ్యాపారవేత్తలు, ఆంత్రప్రెన్యూర్స్, ఇంజనీర్లు, నాన్ ఇంజనీర్లు, మిడ్ లెవెల్ ఎగ్జిక్యూటివ్‌లు అప్లయ్ చేసుకోవచ్చు. అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ఇది ఆన్‌లైన్ బ్లెండెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్ అయినప్పటికీ కొన్ని ఆన్ క్యాంపస్ తరగతులు కూడా నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా ఫ్యాకల్టీ వర్చువల్ మీటింగ్స్, అసైన్‌మెంట్లు, క్విజ్‌లు, పెడగాగి క్లాసెస్, సిమ్యులేషన్స్, ఇండస్ట్రీ వర్క్‌షాప్స్, క్యాప్‌స్టోన్ ప్రాజెక్టులు, ఇతర ప్రాజెక్ట్ వర్క్‌లు, టర్మ్ ఎండ్ ఎగ్జామ్స్ ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తానికి 34.5 క్రెడిట్లు నిర్దేశించారు.



అర్హత

గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

దరఖాస్తు ఫీజు: రూ.2,950

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 6

వెబ్‌సైట్: iimkashipur.ac.in

ఎంఎస్ఈలో పీజీ డిప్లొమా

మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (ఎంఎస్ఈ) ఆధ్వర్యంలోని బిజినెస్ స్కూల్ - పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఫుల్ టైం ప్రోగ్రామ్. దీని వ్యవధి రెండేళ్లు. ఫైనాన్స్, రీసెర్చ్ అండ్ బిజినెస్ అనలిటిక్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. జాతీయ పరీక్ష స్కోర్, అనుభవం, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకు కనీసం 70 శాతం మార్కులు ఉండాలి. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ చదివిన అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. క్యాట్/జీమ్యాట్/ఎక్స్ఏటీ/మ్యాట్/సీమ్యాట్/ఏటీఎంఏ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.


- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** రౌండ్ 1కు ఫిబ్రవరి 19; రౌండ్ 2కు మే 6; రౌండ్ 3కి జూలై 1
- **ఇండక్షన్ ప్రోగ్రామ్:** జూలై 12
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.mse.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/KXuANaqలో చదవండి.

జేఈఈ మెయిన్ ప్రిపరేషన్ టిప్స్

ప్రతిష్ఠాత్మక ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన తొలి వడపోతఅయిన జేఈఈ మెయిన్ మొదటి సెషన్ మరో ఇరవై రోజుల్లో ఆరంభం కానుంది. ఇంటర్ లేదంటే పన్నెం డో తరగతి ఎగ్జామ్స్‌కు ముందే జరిగే ప్రవేశ పరీక్ష ఇది. ఒకరకంగా ఎంట్రెన్స్ అంటే భయం, బెరుకు ఏదైనా ఉంటే దీంతో అవి పోగొట్టుకోవచ్చు. ఇది చక్కగా రాస్తే, మంచి స్కోర్ సాధించగలిగితే ఇంటర్ పరీక్షలు తరవాత సెలవులు ఎంజాయ్ చేయవచ్చు. అలాగే ఐఐటీలో చేరేందుకు ఉద్దేశించిన జేఈఈ అడ్వాన్స్‌డ్‌పై గురిపెట్టవచ్చు. ఈ నేపథ్యంలో ఉన్న ఈ కొద్ది రోజులను సద్వినియోగం చేసుకునేందుకు నిపుణులు సూచించిన కొన్ని టిప్స్

- నేర్చుకున్నది చాలు, ఈ కొద్ది రోజులు రివిజన్‌కు సమయాన్ని ఉపయోగించాలి. ముఖ్యమైన ఫార్ములాలు, థీరమ్స్, రియాక్షన్స్ వంటివి ప్రాక్టీస్ చేయాలి. ప్రాబ్లెమ్స్ సాల్వ్ చేసేందుకు ఇవన్నీ తోడ్పడతాయి. బలంగా ఉన్న వాటిపైనే మరింత శ్రద్ధవహించాల్సిన సమయం ఇది. వచ్చిన వాటినే మరిన్ని సార్లు చదవడం లేదంటే ప్రాక్టీస్ చేయడంతో మైండ్‌లో ఆ టాపిక్ స్థిరపడుతుంది. పరీక్షలో మరింత బాగా ఆన్సర్ చేసేందుకు ఉపయోగపడుతుంది.
- రివిజన్ కోసం షార్ట్ నోట్స్‌ని ఉపయోగించుకోవాలి. అందులో ఫార్ములాలు, కాన్సెప్ట్స్ ఉండేలా చూసుకోవాలి. టాపిక్స్‌లోకి వెళ్లి, ఇవన్నీ ఎక్కడ ఉన్నాయన్నది సరిచూసుకోవడం కష్టం. అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఇది మంచి మార్గం. అలాగే ఫ్లాష్ కార్డులతోనూ ప్రయోజనం ఉంటుంది.
- సబ్జెక్టు లేదంటే ప్రత్యేకించి టాపిక్‌పరంగా ఏవైనా సందేహాలు ఉంటే వాటిని వెంటనే నివృత్తి చేసుకోవాలి. టీచర్ నుంచి సీనియర్ వరకు ఈ విషయంలో ఎవరితో అయినా మాట్లాడవచ్చు. సందేహం తీరడం ముఖ్యం. కాన్సెప్టులను క్షుణ్ణం గా అర్థం చేసుకోవడం కూడా కీలకం.
- సాధ్యమైనన్ని మాక్ టెస్టులు రాయాలి. ఆలిండియా స్థాయిలోవి రాస్తే మంచిది. ఇవి రాస్తే అసలు పరీక్షను ఎదుర్కోవడం సులువు అవుతుంది. ఒకటి రెండు మాక్ టెస్టులు రాసి, పాత పేపర్లను సాల్వ్ చేయడం మరో పద్ధతి. అయితే అది అంత ప్రాక్టికల్‌గా అనిపించదు. దానికి బదులు రోజుకో టెస్ట్ రాసి విశ్లేషించుకోవడం చాలా మంచిది. ఎక్కడ తప్పు చేశామో గుర్తించి, దాన్ని తిరిగి నేర్చుకుంటే కలకాలం గుర్తుంటుంది. అసలు పరీక్షలో సరిగ్గా అదే సమస్యవస్తే సులువుగా గుర్తుకొస్తుంది. అందుకే ఆలిండియా స్థాయిలో జరిగే మాక్‌టెస్టులను ఎంచుకోవాలని విజ్ఞులు చెబుతూ ఉంటారు.
- అర్ధరాత్రి వరకు చదవడానికి ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి చూపుతారు. అయితే అంత సీన్ అవసరం లేదు. రాంగ్ ప్రాక్టీస్ కూడా. పరీక్షలు ముంచుకొస్తున్న ఈ సమయంలో సరిపోను విశ్రాంతి, నిద్ర ఆరోగ్యకరమైన ఆహారం చాలా అవసరం.
- పాజిటివ్ మైండ్‌సెట్‌ను డెవలప్ చేసుకోవాలి. అర్జునుడికి పక్షి కన్నుపై గురి మాదిరిగా రాసే పరీక్షలో సక్సెస్ లక్ష్యం కావాలి. ఒత్తిడి(స్ట్రెస్) అనిపిస్తే వెంటనే మరో ఫన్నీ యాక్టివిటీతో మైండ్‌ను ఫ్రెష్ చేసుకోవాలి. కొద్దిసేపు ఇష్టమైన వాటిపై దృష్టిపెడితే చాలు, ఒత్తిడి చాలావరకు తగ్గుతుంది.
- కాన్సంట్రేషన్ లెవెల్స్ పెంచుకోవడం అన్నది కీలకమే. అందుకే గంటల కొద్దీ చదవకూడదని అంటారు. రెగ్యులర్ బ్రేక్స్ అలాగే ఆ సమయంలో యోగా తదితర కార్యకలాపాలతో మైండ్‌ని ఫ్రెష్‌గా ఉంచుకోవాలి. అదేవిధంగా ప్రిపరేషన్‌పై ఎవరితోనూ చర్చించాల్సిన అవసరం లేదు. పరీక్షకు ప్రిపేర్ కావడం అన్నది వ్యక్తిగతం. అది ఎలా ఉండాలన్నది మనమే నిర్ణయించుకోవాలి.



పరీక్ష హాలులో

- జేఈఈ మెయిన్ ప్రశ్నలను చూసుకునేందుకు మొదట కొద్ది సమయాన్ని ఉపయోగించుకోవాలి. ఆ సమయంలో అస్సలు ఆందోళన చెందవద్దు. ఏవీ తెలియనట్టు అనిపించినా బెదర వద్దు. గట్టిగా శ్వాస తీసుకుని వదలండి.
- ఎప్పుడైన కొన్ని ప్రశ్నలు కష్టంగా ఉంటాయి. సులువైన ప్రశ్న కనిపించే వరకు ముందుకు కదలండి. ఎక్కడో ఒక చోట ఈజీ ప్రశ్న తగులుతుంది. మొదట దాన్ని సాల్వ్ చేయండి. కాన్ఫిడెన్స్ లెవెల్ పెరుగుతుంది. తరవాత మరొకటి సులువైనది తీసుకోండి. అప్పటికి మీరు కుదురుకుంటారు. ఆ తరవాత ఎదురు ఉండదు. వచ్చినవన్నీ సాల్వ్ చేసుకుంటూ వెళ్లడమే పనిగా ఉండాలి.
- ఒక మాట వినే ఉంటారు. కష్టం మీ ఒక్కరికే సొంతం కాదు. అలాంటి వాళ్ళే చాలామంది ఉంటారు. వారిలో మీరు ఒకరు అంతే.
- ప్రశ్న ఏదైనా సాల్వ్ చేసేందుకు కొంత సమయం పెట్టుకోవాలి. రాకుంటే తరవాతి ప్రశ్న చూడాలి. అంతే తప్ప ఒక్క ప్రశ్న దగ్గరే ఆగిపోవద్దు. వచ్చినవి చేసుకుంటూ వెళ్లాలి. అన్నీ అయ్యాక మళ్ళీ మొదటి నుంచి వదిలేసినవి చూసుకుంటూ వెళ్లాలి.
- ఎక్కువ ప్రశ్నలు సాల్వ్ చేసేయాలని అనుకోవద్దు. ఎన్ని కరెక్ట్‌గా చేస్తే ఎంత స్కోర్ వస్తుందో మీకు తెలుసు. అది మదిలో పెట్టుకుని పరీక్షలు ఏవైనా రాయాలని గుర్తుంచుకోవాలి. అదే సక్సెస్ రూట్.

ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్ స్కీమ్

ముంబైలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ)- 'గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్ స్కీమ్ 2023'కి దరఖాస్తులు కోరుతోంది. ప్రభుత్వ/ప్రైవేట్/ఐటీఐ కళాశాలలు సహా ఎన్‌సీవీటీ గుర్తింపు పొందిన ఇండస్ట్రియల్ ట్రయినింగ్ సెంటర్లలో చదువుతున్న ప్రతిభావంతులకు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. ఇందులో జనరల్ స్కాలర్‌షిప్, స్పెషల్ స్కాలర్‌షిప్ ఫర్ గర్ల్ చైల్డ్ కేటగిరీలు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, కుటుంబ వార్షికాదాయం ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

జనరల్ స్కాలర్‌షిప్

అర్హత: గుర్తింపు పొందిన రెగ్యులర్/ఒకేషనల్ కళాశాల నుంచి ఇంటర్/డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి స్థాయి నుంచి ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మెడిసిన్/ఇంజనీరింగ్/ఏదేని గ్రాడ్యుయేషన్/ఒకేషనల్/ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ అభ్యర్థులు; డిప్లొమా తరవాత ఇంజనీరింగ్ మొదటి సంవత్సర ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.

స్కాలర్‌షిప్: మెడిసిన్ చదివేవారికి కోర్సు పూర్తయ్యే వరకూ ఏడాదికి రూ.40,000లను మూడు విడతలుగా(రూ.12,000 + రూ.12,000 + రూ.16,000) చెల్లిస్తారు. ఇంజనీరింగ్ చదివేవారికి ఏడాదికి రూ.30,000(రూ.9,000 + రూ.9,000 + రూ.12,000)లు ఇస్తారు. జనరల్ డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ కోర్సులు, ఒకేషనల్ కోర్సులు చేసేవారికి ఏడాదికి రూ.20,000 (రూ.6,000 + రూ.6,000 + రూ.8,000) ఇస్తారు.

- కోర్సుకు సంబంధించి వార్షిక పరీక్షల్లో కనీసం 55 శాతం మార్కులు వస్తేనే స్కాలర్‌షిప్ రెన్యువల్‌కు అవకాశం లభిస్తుంది



స్పెషల్ స్కాలర్‌షిప్ ఫర్ గర్ల్ చైల్డ్

- బాలికలకు చదువుపై ఆసక్తి కలిగించేందుకు, వారిని ఉన్నత విద్యలో ప్రోత్సహించేందుకు ఈ స్కాలర్‌షిప్ స్కీమ్‌ను రూపొందించారు.
- **అర్హత:** గుర్తింపు పొందిన పాఠశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్/పన్నెండోతరగతి/డిప్లొమా/ఒకేషనల్/ఐటీఐ కోర్సుల్లో అడ్మిషన్ పొంది ఉండాలి.
- **స్కాలర్‌షిప్:** రెండేళ్ల పాటు ఏడాదికి రూ.15,000లను మూడు విడతలుగా (రూ. 4,500 + రూ.4,500 + రూ.6,000) ఇస్తారు.
- కోర్సుకు సంబంధించి మొదటి ఏడాది కనీసం 50 శాతం మార్కులు వస్తేనే స్కాలర్‌షిప్ రెన్యువల్‌కు అనుమతిస్తారు.

ముఖ్య సమాచారం

- కుటుంబ వార్షికాదాయం రూ.2,50,000 మించకూడదు.
- కరస్పాండెన్స్, పార్ట్ టైమ్, ఈవెనింగ్, డిస్టెన్స్, ఓపెన్ యూనివర్సిటీ, సెల్ఫ్ స్టడీ కోర్సులు చేసేవారు; సీఏ/సీఎ స్/ఐసీడబ్ల్యూఏఐ అభ్యర్థులు ఈ స్కీమ్‌నకు అనర్హులు.
- కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే అవకాశం కల్పిస్తారు. ఇద్దరు ఉన్న పక్షంలో ఒకరు బాలిక అయితే ఇద్దరికీ అవకాశం ఇస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 14
- **వెబ్‌సైట్:** https://licindia.in

నవ్య | చిత్రజ్యోతి

నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్ సైంధవ్

వెంకటేశ్



"నా సినీ కెరీర్‌లో 75వ చిత్రంగా 'సైంధవ్' లాంటి సినిమా చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఇది నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్. న్యూ ఏజ్ యాక్షన్ థ్రిల్లర్ చేయాలని ఎప్పటి నుంచో ఉన్న కోరిక ఈ చిత్రంతో నెరవేరింది' అని వెంకటేశ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వం వహించిన చిత్రమిది. వెంకట్ బోయనపల్లి నిర్మాత. నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెరెమియా ప్రధాన తారాగణం. సంక్రాంతి సందర్భంగా జనవరి 13న 'సైంధవ్' విడుదలవుతోంది. బుధవారం చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ 'ఆకట్టుకునే భావోద్వేగాలతో పాటు అబ్బురపరిచే పోరాట ఘట్టాలు మా సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. తప్పకుండా ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇస్తుంది. ట్రైలర్ అద్భుతంగా వచ్చింది. సినిమా కూడా తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుంది. సంక్రాంతికి రిలీజ్ చేస్తున్నాం. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'వెంకటేశ్ గారి కెరీర్‌లో మైలురాయి లాంటి సినిమా చేసే అవకాశం నాకు వచ్చింది. ట్రైలర్‌లోనే కథ మొత్తం క్లుప్తంగా చెప్పానంటేనే సినిమాలో ఎంత విషయం ఉందో మీరే ఊహించుకోవచ్చు. ఇది నా బెస్ట్ ఫిల్మ్. వెంకీ 75వ చిత్రాన్ని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోండి' అని చెప్పారు. వెంకట్ బోయనపల్లి మాట్లాడుతూ 'వెంకటేశ్ గారి లాంటి పెద్ద స్టార్‌తో సినిమా చేసే అవకాశం రావడం నా అదృష్టం. సినిమా విందు భోజనంలా ఉంటుంది' అని తెలిపారు.



ప్రముఖ సినీనటి ప్రభ కుమారుని పెళ్లి రిసెప్షన్ మంగళవారం సాయంత్రం హైదరాబాద్ గండిపేటలోని గోల్కొండ రిసార్ట్స్‌లో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రజ్యోతి పత్రికాధిపతి వేమూరి రాధాకృష్ణ హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలందించారు. ఆయనతోపాటు సీనియర్ నటులు మురళీమోహన్‌ను కూడా ఈ చిత్రంలో చూడొచ్చు. మరుసటిరోజు బుధవారం ఉదయం గోల్కొండ రిసార్ట్స్‌లో రంగరంగవైభవంగా వివాహం జరిగింది. పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై కొత్తదంపతులకు శుభాశీస్సులు అందించారు.

కింగ్‌ఖాన్‌కి కోపమొచ్చింది



షారుక్ రీసెంట్ హిట్ 'డంకీ' ప్రమోషన్‌లో భాగంగా అభిమానులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో వారు అడిగిన ప్రశ్నలకు సరదాసరదాగా సమాధానాలిచ్చేశారు షారుక్. అయితే.. ఓ అభిమాని అత్యుత్సాహంతో అడిగిన ప్రశ్న షారుక్‌ని ఇరిటేట్ చేసింది. 'సార్.. అసలు 'డంకీ' బడ్జెట్ ఎంత? కొందరు 85 కోట్లు అంటున్నారు. కొందరు 120కోట్లు అంటున్నారు. ఇంకొందరేమో మీ రెమ్యునరేషన్ కలుపుకొని 350కోట్లు అంటున్నారు. అసలు నిజం మీ నోటి వెంట వినాలనుంది' అంటూ ఆ అభిమాని ప్రశ్నించగా షారుక్ ముఖ కవళికలు మారిపోయాయి. 'బ్రో.. ఆ విషయాలు నీకవసరమా? బిజినెస్ చేసేవాళ్లకు వదిలెయ్యాలి. ఆ గొడవలు వాళ్లు చూసుకుంటారు. ఉపయోగం లేని విషయాల గురించి ఆలోచించి ఎందుకు టైమ్ వేస్ట్ చేసుకుంటున్నావ్?' అంటూ సున్నితంగా ఆ అభిమానిని మందలించారు షారుక్.

చైనా గోడైనా దూకొచ్చు



నాగార్జున అక్కినేని కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'నా సామిరంగా'. ప్రముఖ కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని దర్శకత్వం వహిస్తున్నారు. రాజ్‌తరుణ్ కీలకపాత్రపోషిస్తున్నారు. బుధవారం చిత్రబృందం రాజ్‌తరుణ్ పాత్రను పరిచయం చేస్తూ గ్లింప్స్ వదిలింది. ఈ చిత్రంలో ఆయన భాస్కర్ అనే కాలేజ్ స్టూడెంట్ పాత్రలో కనిపించనున్నారు. రుక్సార్ ధిల్లాన్‌తో రాజ్‌తరుణ్ ప్రేమకథను గ్లింప్స్‌లో ఆవిష్కరించారు. 'తన చిరునవ్వు కోసం చైనా గోడైనా దూకొచ్చు' అంటూ ఆయన పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. జనవరి 14న విడుదలవుతున్న ఈ చిత్రంలో నాగార్జునకు జోడీగా ఆశికా రంగనాథ్ నటిస్తున్నారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. అల్లరి నరేశ్ కీలకపాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కీరవాణి. ప్రసన్న కుమార్ బెజవాడ కథ, మాటలు అందించారు. సినిమాటోగ్రఫీ: శివేంద్ర దాశరథి.

టైసన్ నాయుడు బరిలో దిగాడు



తొలి చిత్రం 'భీమ్లానాయక్'తోనే దర్శకుడిగా ఘన విజయం అందుకున్నారు సాగర్ కె. చంద్ర. ఇప్పుడు ఆయన బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. సాయి శ్రీనివాస్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించి, గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ చిత్రానికి 'టైసన్ నాయుడు' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను యూనిట్ ఖరారుచేసింది. బాక్సింగ్ దిగ్గజం మైక్ టైసన్ అభిమానిగా శ్రీనివాస్‌ను పరిచయం చేసిన గ్లింప్స్ ఆకట్టుకుంది. ఈ చిత్రంలో ఆయన డీఎస్పీ పాత్రలో అలరించనున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

భక్తిభావంగా రామనామం



తేజ సజ్జ కథానాయకుడిగా ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'హను-మాన్'. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు సినిమాపై అంచనాలను పెంచాయి. బుధవారం చిత్రబృందం 'శ్రీరామదూత స్తోత్రం' విడుదల చేసింది. భక్తిభావం ఉప్పొంగేలా గౌరహరి స్వరాలందించగా, సాయిచరణ్ భాస్కరుణి, లోకేశ్వర్ ఎడర, హర్షవర్ధన్ చావలి శ్రవణానందంగా ఆలపించారు. ఈ చిత్రంలో అమృత అయ్యర్ కథానాయిక. వరలక్ష్మీ శరత్‌కుమార్, వినయ్ రాయ్, గెటప్ శ్రీను, సత్య కీలకపాత్రలు పోషించారు. ప్రైమ్‌షో ఎంటర్టైన్‌మెంట్‌పై శ్రీమతి చైతన్య సమర్పణలో కె. నిరంజన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: శివేంద్ర.

గ్రామీణ ప్రేమకథ ప్రారంభం

సీనియర్ నటుడు దేవరాజ్ తనయుడు ప్రణం దేవరాజ్ హీరోగా శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ బుధవారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఆకాష్ పూరి క్లాప్ ఇచ్చారు. దేవరాజ్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. తనికెళ్ల భరణి చిత్రబృందానికి స్క్రిప్ట్ అందించి, గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు



మాట్లాడుతూ 'నాకు ఇది తొలి చిత్రం. తెలుగు, కన్నడ భాషల్లో తెరకెక్కిస్తున్నాం. ఈనెలలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అన్నారు. దేవరాజ్ పాన్ ఇండియా హీరో, వాళ్ల బ్బాయి ప్రణం దేవరాజ్ కూడా ఈ రంగంలోకి వచ్చినందుకు ఆనందంగా ఉంది అని తనికెళ్ల భరణి చెప్పారు. ప్రణం దేవరాజ్ మాట్లాడుతూ 'ఇది తెలుగులో నాకు మూడో చిత్రం. మంచి లవ్ స్టోరీ, యాక్షన్ అంశాలతో రూపొందుతోంది' అని చెప్పారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న కుటుంబ కథా చిత్రమిదని నిర్మాత పి. హరికృష్ణ గౌడ్ తెలిపారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/jIEtdJ5 లో చదవండి.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

వైసీపీ పతనం ప్రారంభ మైంది

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జనవరి 3 : రాష్ట్రంలో వైసీపీ పతనం ప్రారంభ మైందని, ఇక జగన్‌రెడ్డి ఎన్ని కుతంత్రాలు పన్నినా ఆ పార్టీ ఎన్నికల్లో తిరిగి గెలిచే అవకాశం లేదని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టంచేశారు. బుధవారం చిలకలూరిపేట పట్టణంలోని 6వ వార్డులో స్థానిక టీడీపీ శ్రేణులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ.. బీటలు వారిన వైసీపీ సౌధం ఏ క్షణమైనా కుప్పకూలి పోవచ్చని, నివురుగప్పిన నిప్పులా ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను దారి మళ్ళించటానికి సీఎం జగన్‌రెడ్డి సిట్టింగ్‌లను మారుస్తూ హైడ్రామా నడిపిస్తున్నాడని, ఆయనేంచేసినా ప్రజలు మళ్ళీ వైసీపీని, జగన్‌ను నమ్మి ఓట్లేసే పరిస్థితి లేదన్నారు. వార్డుల వారి సమీక్షలో భాగంగా తొలి రోజు 2, 3, 6, 7, 8 వార్డు నాయకులతో మాట్లాడి వార్డులోని ప్రధాన సమస్యలను తెలుసుకున్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ, ఓటర్ల జాబితా పరిశీలన, పార్టీ కార్యక్రమాల నిర్వాహణ, నాయకుల పనితీరుపై చర్చించారు. రాష్ట్రంలో ఎన్నికలకు ఎంతో సమయం లేదని, పార్టీ నాయకులు, కార్యకర్తలు రానున్న మూడు నెలల్లో దూకుడుగా పని చేయాలని ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు.

వైసీపీ కార్యాలయంపై రాళ్లదాడి కేసులో

మరో 9 మంది అరెస్ట్ .. విడుదల

గుంటూరు,జనవరి 3: గుంటూరు నగరంలోని లక్ష్మీపురం సాయిబాబారోడ్డు సెంటర్‌లో డిసెంబరు 31 అర్ధరాత్రి వైసీపీ కార్యాలయంపై రాళ్ళు రువ్విన కేసులో మరో 9 మందిని బుధవారం పట్టాభిపురం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదే కేసులో ఇప్పటికే సుమారు 25 మందిని సోమవారం అరెస్ట్ చేసిన విషయం విధితమే. తాజాగా మరోమ 9 మందిని అరెస్ట్ చేసి వారిని బెయిల్ పై విడుదల చేశారు. కేవలం ఒకరిద్దరు మాత్రమే రాళ్ళువిసిరితే సంబంధం లేని ఎంతో మందిని అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, బాధితుల కుటుంబీకులు ఆరోపిస్తున్నారు.

గురుకుల విద్యాలయ సొసైటీలో

ఆయనో మోనార్క్!

● తాను చెప్పిందే వినాలి.. ఇతరుల సలహాలు పట్టించుకోరు.

● గురుకులాల్లో అంతర్గత సమస్యలపై ప్రిన్సిపాళ్ల గోడు



గుంటూరు కొరిటెపాడులోని గురుకుల సొసైటీ కార్యాలయం

గుంటూరు(విద్య),జనవరి 3: గురుకుల విద్యాలయ సొసైటీలో అంతర్గత సమస్యలు విద్యార్థులకు శాపాలుగా మారుతున్నాయి. ప్రిన్సిపాళ్ల చేసిన అనేకప్రతిపాదనలు అధికారుల నిర్లక్ష్యంతో ఆమోదానికి నోచుకోవడంలేదు. దీంతో కనీసం నిర్వహణ ఖర్చులు చెల్లించ లేని పరిస్థితి ఏర్పడిందని ప్రిన్సిపాళ్లు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల వైద్య పరీక్షలకు గతి లేదు..

విద్యార్థులకు నెలకు ఒకసారి నిర్వహించే వైద్య పరీక్షలను కొంతకాలంగా చేయిండటంలేదని, కనీసం పీహెచ్‌సీ స్థాయి వైద్యుల చేతనైనా వైద్యపరీక్షలు నిర్వహించాలని తాము చేసిన విజ్ఞప్తిని సొసైటీలోని ఆ అధికారి పెడచెవిన పెడుతున్నారని ప్రిన్సిపాళ్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే లయన్స్‌క్లబ్, రోటరీ తదితర స్వచ్ఛంద సంస్థల వితరణ కార్యక్రమాలను సైతం అడ్డుకుంటున్నాడని ప్రిన్సిపాళ్లు వాపోయాతున్నారు. కనీసం విద్యాలయాల్లో ట్యూబ్‌లైట్లు, మోటార్ రిపేరు, అత్యవసరమైన భవనాల మరమ్మతుల గురించి ప్రిన్సిపాళ్లు ఎన్నిసార్లు ప్రతిపాదనలు చేసినా స్పందించడం లేదు. సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే సమీక్షలు కూడా రహస్యంగా నిర్వహిస్తారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇటీవల గుంటూరు నగరంలో గురుకుల విద్యాయాల సొసైటీ ఆధ్వర్యంలో మెరుగైన ఫలితాలు సాధించిన ప్రిన్సిపాళ్లకు సత్కార సభ నిర్వహించారు. ఈసమావేశంలో ఓ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. 'ఆంధ్రజ్యోతిలో గురుకుల ఘోషశీర్షికతో వచ్చిన కథనంపై చర్చ పెట్టారు. ఈ సందర్భంగా పత్రికలకు ఓ లేఖ ఇచ్చారని సిబ్బందిపై సదరు అధికారి అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. ఈ సంఘటను మరో ప్రిన్సిపాల్ సెల్‌ఫోన్‌లో రికార్డు చేస్తున్న ఈ విషయం గమనించిన ఆయన హుటాహుటిన ఆ ప్రిన్సిపాల్ వద్దకు వచ్చి ఆయన సెల్ లాక్కుని నెలకేసి కొట్టారు. 'ఏంటీ తమాషాగా ఉందా?' అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

గురుకులాలు అద్భుతంగా ఉన్నాయంటూ సొంత కితాబు..

గురుకులాలు అన్ని అద్భుతంగా ఉన్నాయని, ప్రిన్సిపాళ్లు సిబ్బంది సమస్యలు సృష్టిస్తున్నారని సదరు అధికారి కితాబు ఇవ్వడంతో పాటు ప్రిన్సిపాళ్లపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఆ అధికారి ఏ విద్యాలయ పర్యటనలకు వెళ్ళిన దాఖలాలు దాదాపు లేవు. ఆ అధికారి ఏవరి మాటవినిపించుకోరు. చుట్టూ ఉన్న కోటరీలోని వ్యక్తుల మాట తప్పించి ఏవరి మాట వినరు అనే ప్రచారం సాగుతోంది. దీర్ఘకాలంగా పనిచేసే ఓ ద్వితీయశ్రేణి అధికారి చెప్పిందే వేదంగా భావిస్తారని సమాచారం. వాస్తంగా కార్యాలయాన్ని సచివాలయ సమీపానికి తరలించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇక్కడ అద్దె భవనంలోనే లక్షలు చెల్లిస్తూ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడికి రావాలంటే ప్రిన్సిపాళ్లకు, ఇతర సిబ్బందికి అనదపు భారం తప్పడం లేదు. రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులు సర్వీస్ విషయాల్లో ముడుపులు ఇచ్చుకోవాల్సిన దుస్థితి ఉందని ఆరోపణల ఉన్నాయి.

పేద,బడగు బలహీనవర్గాల విద్యా ఉన్నతికి పాటు పడాల్సిన గురుకుల విద్యాలయాలు ఒకవైపు ప్రభుత్వ నిర్లక్ష్యంతో అస్తవ్యస్తంగా మారుతుంటే మరోవైపు ఉన్నత స్థాయిలో అధికారులు సమస్యల్ని మరింత జటిలం చేస్తున్నారు. గురుకుల విద్యాలయాల్లో పరిపాలనా పరమైన సమస్యల్ని పట్టించుకోకుండా తమ సొంత ఎజెండా అమలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

సిటీ, ఎమ్మారై స్కాన్ యంత్రాలుకు సుస్తీ

● రోగులకు తప్పని అవస్థలు

● వ్యయ ప్రయాసలకోరి బయట సెంటర్‌లకు వెళుతున్న వైనం



ఎమ్మారైస్కాన్ పనిచేయకపోవడంతో గదులకు తాళాలు వేసి ఉన్న దృశ్యం

తెనాలిరూరల్, జనవరి 3: జిల్లాలోనే అతి పెద్ద రెండవ వైద్యశాలగా సేవలందిస్తున్న తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో రోగులకు వ్యాధి నిర్ధారణ చేసే సిటీస్కాన్, ఎమ్మారై వంటి పరికరాలు మొరాయించాయి. గత రెండేళ్లుగా సిటీస్కానర్ మరమ్మతులకు నోచుకోకపోగా తాజాగా ఎమ్మారై స్కాన్ కూడా మొరాయించింది. దీంతో అనారోగ్య సమస్యలతో వైద్యశాలకు వచ్చే రోగులకు వ్యాధి నిర్ధారణ చేసేందుకు అవసరమైన పరీక్షలు అందుబాటులో ఉండటం లేదు. తెనాలిలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తెనాలి, దుగ్గిరాలు, కొల్లిపర, కొల్లూరు, చుండూరు, చేబ్రోలు, వేమూరు, అమర్తలూరు మండలాల నుంచి అధిక సంఖ్యలో రోగులు వైద్యసేవలకు వస్తుంటారు. ఇవే కాకుండా యాక్సిడెంట్, పాయిజన్ తీసుకున్న అత్యవసర కేసులు తరచుగా వస్తుంటాయి. అలాగే ఆర్థో విభాగంలోని రోగుల వ్యాధి నిర్ధారణ, శస్త్రచికిత్సల సందర్భంలో సిటీ స్కాన్, ఎమ్మారై స్కాన్‌ల అవసరం ఉంటుంది. ఐతే ఆస్పత్రిలో ఎమ్మారై, సిటీ స్కాన్ యంత్రాలు రెండు అందోబాటులో లేకపోవడంతో రోగులు బయటకు వెళ్లి చేయించుకోవల్సి వస్తుంది. కాగా ఈ పరీక్షలు ఎంతో ఖర్చుతో కూడుకున్నవి. అత్యవసర వైద్యం కోసం వచ్చే వారు ఆసుపత్రి నుంచి స్కానింగ్ సెంటర్లకు తరలించడం సాధ్యం కాకపోవడం, పైగా ఆయా స్కాన్ లకు ఖర్చు భరించలేక పోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆసుపత్రి ఉన్నతాధికారులు వైద్యశాల్లోని రోగులకు సిటీ స్కాన్, ఎమ్మారై స్కాన్‌ల వంటి సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి రోగులకు నాణ్యమైన వైద్యం అందించేలా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఏసీబీ వలలో విద్యుత్ ఏఈ, లైన్‌మెన్

● రూ.45 వేలు లంచం తీసుకుంటూ చిక్కిన వైనం



అవినీతి అధికారులను పట్టించిన రైతు

రాజుపాలెం, జనవరి 3: ఓ రైతు పొలానికి విద్యుత్ కనెక్షన్ విషయంలో లంచం డిమాండ్ చేసిన విద్యుత్ శాఖలోని ఏఈ, ఓ ప్రైవేట్ లైన్‌మెన్‌ను బుధవారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన రైతు సరికొండ వెంకటేశ్వర రాజు చుట్టు ప్రక్కల పొలాలకు చెందిన రైతులతో కలసి తన పొలంలో నూతన విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కనెక్షన్ మంజూరు చేయాలంటే రూ.50 వేలు నగదు ఇవ్వాలని విద్యుత్‌శాఖ అధికారులు డిమాండ్ చేశారు. తాము అంతమొత్తంలో ఇవ్వలేమని చెప్పినప్పటికీ వారు ఒప్పుకోలేదు. దీంతో బాధిత రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు బుధవారం రంగంలోకిదిగి పథకం ప్రకారం సత్తెనపల్లి నుండి వస్తున్న విద్యుత్ శాఖ ఏఈ విజ్ఞాన ప్రసాద్, ప్రైవేటు లైన్‌మెన్ నూర్‌బాషా ఆదంషఫీలను రెడ్డిగూడెంలో లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. వారిని రాజుపాలెంలోని విద్యుత్ శాఖ కార్యాలయానికి తీసుకువచ్చి విచారిస్తున్నారు. దాడుల్లో అడిషనల్ ఎస్పీ మహేంద్రమత్తె, డీఎస్పీ ప్రతాప్ సత్యానంద్, సీఐలు రవిబాబు, నరసింహారెడ్డి, అంజిబాబు, మన్మధరావు, సురేష్, నాగరాజు, ఎస్ఐ శ్రీనివాస్ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య



కౌలు రైతు యానాదిరావు (ఫైల్)

వేమూరు, జనవరి 3 : అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చావలి గ్రామంలో జరిగింది. గోపాలం యానాదిరావు అనే కౌలు రైతు 10 సంవత్సరాల నుంచి 7 ఎకరాల భూమిని కౌలుకు చేస్తూ ఉన్నాడు. వ్యవసాయ పెట్టుబడుల కోసం గతంలో రూ.10 లక్షల దాకా ఖర్చు చేసి నష్టపోయాడు. ఈ ఏడాది సాగుచేసినప్పటికీ ఇటీవల సంభవించిన తుఫానుకు చేతికి అంది వచ్చిన పంట పూర్తిగా దెబ్బతింది. పెరిగిన అప్పుల భారంతో మనోవేదనకు గురైన యానాదిరావు మంగళవారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. దీనిపై వేమూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

6న గుంటూరుకు ఉదయ్ ఎక్స్‌ప్రెస్

● అదేరోజు అమరావతి ఎక్స్‌ప్రెస్ నరసపూర్ వరకు పొడిగింపు

● జెండా ఊపి ప్రారంభించనున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

● గుంటూరు రైల్వేస్టేషన్‌లో వీడియో లింకు ద్వారా ఏర్పాట్లు

● జీఎం నుంచి డీఆర్ఎంకు ఆదేశాల జారీ

గుంటూరు, జనవరి3 (ఆంధ్రజ్యోతి): ఎన్నాళ్లగో ఎదురు చూస్తున్న విశాఖపట్టణం - గుంటూరు - విశాఖపట్టణం ఉదయ్ ఏసీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6వ తేదీన గుంటూరు నుంచి రాకపోకలు సాగించనుంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ నుంచి గుంటూరు డీఆర్ఎంకు ఆదేశాలు జారీ అయ్యాయి. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శనివారం ఉదయం నరసపూర్ రైల్వేస్టేషన్‌లో ఈ రైలుని వీడియో రిమోట్ లింకు ద్వారా ప్రారంభిస్తారు. ఆ కార్యక్రమానికి సంబంధించి గుంటూరు రైల్వేస్టేషన్‌లో వీక్షించేందుకు విస్తృత ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో గుంటూరు జిల్లా ప్రయాణీకులకు కొత్తగా ఏసీ డబుల్ డెక్కర్ లాంటి రైలు నిత్యం విశాఖపట్టణానికి అందుబాటులోకి రానుంది.

ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ని తొలుత విశాఖపట్టణం-విజయవాడ- విశాఖపట్టణం మధ్యన నడిపేందుకు ఏర్పాటుచేశారు. ఆరైలుని గుంటూరు వరకు పొడిగించాలని ఎంపీలు గల్లా జయదేవ్, లావు శ్రీకృష్ణదేవరాయలు, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మోపిదేవి వెంకట రమణలు పలుమార్లు రైల్వేబోర్డు, దక్షిణ మధ్య రైల్వే జీఎంకి విజ్ఞప్తి చేశారు. దాంతో ఏడాది క్రితమే ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ని గుంటూరుకు పొడిగిస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకోగా సాంకేతిక కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎట్టకేలకు ముహూర్తాన్ని ఖరారు చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమయం ఇవ్వడంతో ఈ నెల 6వ తేదీ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీని వలన ఉదయం విశాఖపట్టణం నుంచి గుంటూరుకు, సాయంత్రం గుంటూరు నుంచి విశాఖపట్టణానికి కొత్తరైలు అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతం గుంటూరు మీదగా నిత్యం రాత్రి వేళ విజయ వాడ - హుబ్లీ మధ్యన రాకపోకలు సాగిస్తున్న అమరావతి ఎక్స్‌ప్రెస్‌ని నరసపూర్ వరకు పొడిగించారు. పొడిగింపు కారణంగా ఈ రైలు వేగాన్ని కూడా పెంచారు. ప్రస్తుతం హుబ్లీ నుంచి గుంటూరుకు చేరుకొంటున్న సమయాన్ని దాదాపుగా గంట తగ్గించారు. ఈ రైలు ఉదయం 7.30 గంటలకు నరసపూర్ చేరుకొనేలా టైంటేబుల్ రూపొందించారు. నరసపూర్ నుంచి హుబ్లీకి వచ్చే రైలు విజయవాడ నుంచి పాత సమయపట్టికలోనే ప్రయాణిస్తుంది. ఈ రైలు వలన నరసపూర్‌కు చేరుకోవడానికి అదనపు సౌకర్యం ప్రయాణీకులకు అందుబాటులోకి వస్తుంది.

సమన్వయకర్తకూ.. సలాం

● నూతన సంవత్సరం రోజున వైసీపీ కార్యాలయానికి క్యూ కట్టిన పోలీసు శాఖ

● ఆ పార్టీ నేతలతో కలసి వేడుకల్లో పాల్గొన్న అధికారులు

● వైసీపీ సమన్వయకర్తతో కలసి కేక్ కటింగ్ ...



వైసీపీ కార్యాలయంలో బలసాని కిరణ్ కుమార్‌తో కలిసి కేక్ కట్ చేస్తున్న గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ, ప్రత్తిపాడు, నల్లపాడు సీఐలు, ఎస్ఐలు

ప్రత్తిపాడు, జనవరి 3: ఆయన ఎమ్మెల్యే కాదు.. మంత్రి కాదు.. అధికారికంగా ఎలాంటి పదవులు లేవు.. కేవలం ఒక రాజకీయ పార్టీ తరుపున ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త మాత్రమే. ఏ పదవి, హోదా లేని వ్యక్తికి నియోజకవర్గ పోలీస్ డిపార్ట్‌మెంట్ అధికారులంతా సలాం చేశారు. ఏకంగా పార్టీ కార్యాలయానికి అధికారికంగా వెళ్లి పుష్పగుచ్చాలు ఇచ్చి తమ స్వామి భక్తిని చాటుకున్నారు. డీఎస్పీ నుండి ఎస్ఐల వరకు అందరూ క్యూ కట్టారంటే ఈయన స్థాయి ఏమిటో... అంటూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలే విస్తుపోయారు. ప్రత్తిపాడు నియోజకవర్గానికి వైసీపీ సమన్వయకర్తగా బలసాని కిరణ్ నియమితులైనప్పటి నుంచి ఆయకు అన్ని శాఖల అధికారులు సలాం చేస్తూనే ఉన్నారు. తాజాగా నూతన సంవత్సరం సందర్భంగా వైసీపీ పార్టీ కార్యాలయంలో గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ, ప్రత్తిపాడు, నల్లపాడు సీఐలతో పాటు ప్రత్తిపాడు ఎస్ఐ మినహా అన్ని మండలాల ఎస్ఐలు బలసాని కిరణ్ కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం, మొక్కలు అందజేసి ఆ తరువాత కేక్ కూడా కట్ చేసి వచ్చారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఒక రాజకీయ పార్టీ తరుపున పోటీచేసే అభ్యర్థి పట్ల పోలీసు శాఖ తమ స్వామి భక్తిని చూపించడం ప్రస్తుతం చర్చాంసనీయంగా మారంది. పోలీస్ అధికారులు వైసీపీ నేత బలసాని కిరణ్ కుమార్‌ను కలిసిన ఫోటోలు సోషన్ మీడియాలో వ్యాప్తి చెందుతున్నాయి.



బలసానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ



తుళ్ళూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

స్వప్రయోజనాల కోసమే మూడు రాజధానులు


● రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్న వైసీపీ ప్రభుత్వం

● 1478వ రోజుకు అమరావతి రైతుల ఆందోళనలు

తుళ్ళూరు జనవరి 3: రాష్ట్ర రాజధాని అమరావతి కోసం మాత్రమే మూడు పంటలు పంటలు పండే భూమిని తాము త్యాగం చేశామని, కానీ వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరిట తమ జీవితాలతో చెలగాటమాడుతుందని 33 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు , రైతు కూలీలు చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 1478వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మూడు రాజధానుల ప్రతిపాదన పాలకుల ప్రయోజనం కోసమన్నారు. ప్రభుత్వాలు మారినా.. రాష్ట్ర రాజధాని అమరావతి మారదన్నారు. కేంద్రం ప్రభుత్వం కూడా అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని పలు మార్లు స్పష్టం చేసిందన్నారు. జగన్‌రెడ్డి మూర్ఖంగా మూడు అంటూ రాష్ట్ర భవిషత్‌ని నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం తీర్పు ప్రకారం అమరావతి అభివృద్ధిని కొనాగించాలని మూడు రాజధానులకు వ్యతిరేకంగా రాజధాని ప్రాంత గ్రామాల్లో నిరసనలు తెలిపారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు.

పింఛన్లలో మోసం చేసిన జగన్

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, జనవరి3: అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.3 వేలు పింఛన్‌ను ప్రతి ఒక్కరికి అందిస్తామని గొప్పలు చెప్పిన జగన్ నేడు అధికారంలోకి వచ్చాక ఐదేళ్లకు రూ.3 వేల పింఛన్ ఇస్తూ పింఛన్‌దారులను జగన్ మోసం చేశాడని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. 1984లో రూ.35 ఎన్టీ రామారావు పింఛన్ పథకాన్ని ప్రారంభించగా 1997లో చంద్రబాబునాయుడు రూ.75లకు పెంచార న్నారు. కాంగ్రెస్ పదేళ్ల పాలనలో రూ. 125 పెంచి రూ.200 అందజేసిందని, ఆ తర్వాత చంద్రబాబునాయుడు రూ.1800 పెంచి రూ.2000 ఇచ్చాడని గుర్తుచేశారు. 2019 ఎన్నికలహామీలో చంద్రబాబు ఆయన సీఎం అయ్యాక మొదటి నుంచే రూ. 3 వేలు ఇస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. జగన్ మోసపూరిత హామీతో ప్రతి పింఛన్‌దారుడు ఈ ఐదేళ్లలో రూ.31 వేలకుపైగా నష్టపోయాడని తెలిపారు. మరోసారి జగన్‌ను నమ్మే పరిస్థితిలో పింఛన్ దారులు, రాష్ట్ర ప్రజలు లేరన్నారు. చంద్రబాబును గెలిపించుకొని వుంటే మొదటి నెల నుండే 3 వేల రూపాయలు పింఛన్ తీసుకొని వుండేవారమని, ఇప్పుడు బాధపడి ప్రయోజనం ఏమిటంటూ పింఛన్‌దారులు మదనపడు తున్నారని యరపతినేని తెలిపారు.

ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్

డాక్టర్ గురవారెడ్డికి పితృవియోగం



అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి (ఫైల్)

హైదరాబాద్ సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : కిమ్స్ సన్‌షైన్ ఎండీ, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ గురవారెడ్డి తండ్రి అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి (90) బుధవారం సాయంత్రం వృద్ధాప్యంతో మృతిచెందారు. 1933లో తుమ్మల చెరువు, పల్నాడు గ్రామంలో జన్మించిన ఆయనకు రాజ్యలక్ష్మితో వివాహమైంది. కీటకాల శాస్త్రవేత్తగా పేరుగాంచారు. ఆయనకు ముగ్గురు కుమారులు గురవారెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, నర్సింహారెడ్డి. చదువుకి అంకితంగా తన మరణానంతరం తన దేహాన్ని వైద్య విద్యార్థులకు ఉపయోగపడాలన్న తండ్రి కోరిక మేరకు ఉస్మానియా ఆస్పత్రికి మా తండ్రి దేహాన్ని ఇస్తున్నట్లు డాక్టర్ గురవారెడ్డి తెలిపారు. మా నాన్న గారే మా అందరికి ఆదర్శం. అందర్ని తారతమ్యం లేకుండా సమానంగా గౌరవించే మానవత్వాన్ని ఆయన దగ్గరనుంచే నేర్చుకున్నాం.

పిండ మార్పిడి విధానంలో

ఆవుదూడ జననం



పిండ మార్పిడి విధానం ద్వారా జన్మించిన దూడతో రైతు

క్రోసూరు, జనవరి 3 : పూర్తిస్థాయి స్వదేశీ పరిజ్ఞానంతో పిండమార్పిడి విధానం ద్వారా మేలు రకం ఆవు దూడను ఉత్పత్తి చేయటంలో క్రోసూరు పశు వైద్యాధికారులు విజయం సాధించారు. పశు సంవర్ధక శాఖ, శ్రీ వెంకటేశ్వర పశు విద్యాలయం సంయుక్త కార్యాచరణ ద్వారా ఈపిండ మార్పిడి ప్రక్రియ అమలు చేసినట్టు స్థానిక వైద్యులు తెలిపారు. మేలురకం దూడను హసానాబాద్ గ్రామానికి చెందిన శ్రీరామ్‌శెట్టి కృష్ణకు చెందిన నాటు ఆవు గర్భంలో గత సంవత్సరం మార్చి 1 ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. ఆరోగ్య వంత మైన ఒంగోలు జాతి ఆవు దూడకు ఆవు జన్మనిచ్చినట్లు వారు తెలిపారు. పశు గణాభివృద్ధి సంస్థలో పని చేస్తున్న శ్రీమన్నారాయణ ఐవీఎఫ్ ద్వారా ఫల దీకరణ చెందిన పిండాన్ని అభివృద్ధి చేయటంలో ప్రధా న పాత్ర పోషించినట్లు తెలిపారు. లాంఫారంలో పని చేస్తున్న శ్రీకాంత్ సేవలు అందించారుఆవును ఎంపిక చేసి పిండాన్ని ఆవు గర్భంలోకి ప్రవేశ పెట్టడానికి స్థానికవైద్యులు సీహెచ్ మల్లయ్య కృషిచేశారు. లాం ఫారం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ముత్తారావు మార్గదర్శకం చేశారు. ఆవుదూడను ఉత్పత్తి చేయటం తాము సాధించిన విజయంగా స్థానిక పశు వైద్య బృందం తెలియజేశారు. ఈ ప్రయోగాన్ని స్థానికంగా మరికొన్ని ఆవుల్లో ప్రవేశ పెట్టి ఆవు దూడల ఉత్పత్తిని కొనసాగిస్తామని పశు వైద్యులు ఈ సందర్భంగా తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	96, 104, 115
చికెన్ విత్ స్కిన్	186.00
చికెన్ స్కిన్ లెస్	196.00

57,983 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 59,321 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 57,983 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 34,701 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	10000	22000	334	14000	21000
నెంబరు. 5	10400	17500	నెంబరు. 5	10500	15000
273	12300	17500	273	12000	12000
341	10000	18700	341	11000	18500
4884	14000	15500	4884	–	–
సూపర్ 10	13000	13500	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	9000	23000	తేజ	9500	23000
బ్యాడిగి	12000	23000	బ్యాడిగి	12500	19500
దేవనూరు డీలక్స్	10000	19000	దేవనూరు డీలక్స్	14000	14000
తెల్లకాయలు	5000	14000	తెల్లకాయలు	7000	12000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

● ధర్నాకు మద్దతుగా సీపీఐ, ఏఐటీయూసీ నాయకుల మద్దతు

బాపట్లటౌన్, జనవరి 3: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్రలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరిస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని సీపీఐ జిల్లా నాయకులు జేబీ శ్రీధర్ అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగాల కార్మికులు చేస్తున్న నిరసనకు సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమానవేతనం చెల్లించాలని మున్సిపల్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కాంట్రాక్టర్, ఔట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికుల సమస్యలను వైసీపీ ప్రభుత్వం పరిష్కరించకపోతే రాబోవు రోజుల్లో ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నామని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమం లో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్, అల్లాభక్షి, మున్సిపల్ కాంట్రాక్ట్, పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికుల సమ్మెలో మాట్లాడుతున్న నాగాంజనేయులు

● రేపల్లె, జనవరి 3: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వ హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయు లు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ శిబిరాన్ని ఏఐటీయూసీ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, యూనియన్ నాయకులు చిరంశెట్టి శ్రీనివాసరావు, కుసుమ, సత్యవతి, వెంకటేశ్వరరావు, సాంబయ్య, దుర్గారావు, అరుణ, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా వైద్యశాలలో అందని ద్రాక్షగా వైద్యం : వేగేశన

బాపట్ల, జనవరి 3: బాపట్ల ఏరియా వైద్యశాలలో పేదలకు సరైన వైద్యం అందడంలేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ విమర్శించారు. స్థానిక జనసేనపార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీశ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వేగేశన మాట్లాడుతూ 21 మంది వైద్యులు ఉండాల్సిన ఆసుపత్రిలో 9 మంది మాత్రమే వైద్యం చేస్తున్నారన్నారు. అంబులెన్స్ సౌకర్యం లేకపోవటం వల్ల ప్రైవేట్ అంబులెన్స్‌లు విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్నాయని పేదలు గగ్గోలు పెడుతున్నారన్నారు. జనసేనపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ మాట్లాడుతూ ఉమ్మడి కార్యాచరణతో సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో జనసేన నాయకులు గొట్టిపాటి శ్రీకృష్ణ, హుస్సేన్‌బేగ్, దాసరి ఏసుబాబు, కొత్రా మణికంఠ, కారుమూరి అంజనేష్, ఆరమళ్ళ సుజిత్, రాజేష్, సురేంద్ర, సత్తార్ పాల్గొన్నారు.


తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ - బాపట్ల.

కార్పెంటర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

భట్టిప్రోలు, జనవరి 3 : రాష్ట్ర కార్పెంటర్స్ అసోసియేషన్ అమరావతి నూతన సంవత్సర క్యాలండర్‌ను మండల పరిషత్ కార్యాయంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కోడూరు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపీపీ డి.లలితకుమారి, జడ్పీటీసీ టి.ఉదయభాస్కరీ ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఏవో జలజ, ఎంఈవో దేవరాజ్, కార్యదర్శి రాంకుమార్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

బాపట్ల, జనవరి 3 : మండలంలోని నందిరాజుతోట గ్రామంలో అక్రమ మద్యంను సెబ్ అధికారులు బుధవారం స్వాధీనం కున్నారు. తూర్పుపిన్నిబోయన వారిపాలెం గ్రామానికి చెందిన ఖాజా నరసింహారావు బైక్‌పై మద్యం బాటిల్స్ తీసుకెళుతున్నట్లు గుర్తించి తనిఖీ చేయగా 17మద్యం బాటిల్స్ లభించాయి. దీంతో మద్యం, ద్విచక్రవాహనం సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సెబ్ సీఐ ఎస్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని చినబేతపూడిలో సారా తయారీ కేంద్రంపై దాడి చేశారు. రైల్వేట్రాక్ సమీపంలో ప్రభుత్వ పోరంబోకు భూమిలో 500లీటర్లు బెల్లంఊటను గుర్తించి ధ్వంసం చేశారు. కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రభుదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

పోరాటం ఉధృతం చేస్తాం

● నేడు కలెక్టరేట్‌కు వచ్చాం.. రేపు తాడేపల్లి వస్తాం

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి


ఆర్డీవో రవీందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్

బాపట్ల, జనవరి 3: ప్రభుత్వం దిగి వచ్చి సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఉధృతం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి స్పష్టం చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం బాపట్ల కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. జిల్లాలోని 6 నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు ఆటోలు, లారీల్లో తరలి వచ్చారు. జీబీసీ రోడ్డులో ఉన్న ఆర్‌వోబీ దగ్గర కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట పెద్దఎత్తున అంగన్‌వాడీలు బైఠాయించటంతో వాహనాలు కలెక్టరేట్‌లోని వెళ్లే అవకాశం లేకుండాపోయింది. కార్యకర్తలు లోపలికి వెళ్ళకుండా డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు, పట్టణ సీఐ యు.శ్రీనివాసులు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు ఏమాత్రం జంకులేకుండా ప్రభుత్వ విధానాలను తీవ్రంగా దుయ్యబట్టారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ నేడు కలెక్టరేట్‌కు వచ్చి న కార్యకర్తలంతా రేపు తాడేపల్లి వచ్చి ముట్టడిస్తామని హెచ్చరించారు. మీ ఫ్యాన్ ఆగిపోవటం ఖాయమన్నారు. ఒక్కసారి తాడేపల్లి ప్యాలెస్ నుంచి ముఖ్యమంత్రి బయటకొచ్చి చూడాలన్నారు. మీ అయ్య దిగివచ్చినా అంగన్‌వాడీ సెంటర్లు నడపలేరని విమర్శించారు. కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌ను వెనక్కి తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్డీవో గంధం రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్ కాపీలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్ప ర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రేఖా ఎలిజబెత్, బాపట్ల అధ్యక్షురా లు వెలగా శైలశ్రీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్, శరత్, ఎస్ఎఫ్ఐ, అంగన్‌వాడీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

బెదిరింపులకు దిగితే మూల్యం చెల్లించుకోక తప్పదు

రేపల్లె, జనవరి 3: అంగన్‌వాడీలను బెదిరింపులకు భయాందోళనకు గురి చేయాలని చూస్తే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రేపల్లె పట్టణంలోని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటియూసీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె 23వరోజుకు చేరింది. ఆర్డీవో కార్యాలయాన్ని అంగన్‌వాడీలు ముట్టడించి నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కన్వీనర్ జీ.నాగమల్లేశ్వరమ్మ, వై కనకదుర్గ, ప్రమీల, ఎస్ వాణి, రమాదేవి, లక్ష్మి, పి.నాగాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ

బాపట్ల, జనవరి 3 : కలెక్టర్ పి.రంజిత్‌బాషాను బుధవారం ఎస్పీ వకుల్ జిందాల్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన సంవత్సరంలో చేపట్టే కార్యక్రమాలు గురించి చర్చించారు.

డీఆర్‌డీఏ పీడీగా కృష్ణ

డీఆర్‌డీఏ పీడీగా చొప్పరపు కృష్ణ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పీడీని డీఆర్‌డీఏ అండ్ వైఎస్సార్ క్రాంతి పథకం యూనియన్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ తుళ్ళూరి శ్రీనివాసరావు, సెక్రటరి శొంఠి పూర్ణచంద్రరావు, కోశాధికారి మాచవరపు రమేష్, ఉపాధ్యక్షుడు పర్చూరి ప్రమీల, జాయింట్ సెక్రటరి వెంకయ్య, ఏరి యా కోఆర్డినేటర్లు, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పరిశ్రమల అధికారిగా రామకృష్ణ

జిల్లా పరిశ్రమలశాఖాధికారిగా వై రామకృష్ణ బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన మదన్మోహన్‌శెట్టి బదిలీపై వెళ్ళటంతో ఆయన స్థానంలో రామకృష్ణను నియమించారు. బుధవారం బాధ్యతలు చేపట్టిన ఆయన కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల మహాధర్నా

కొల్లూరు, జనవరి 3 : ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసి స్టెంట్లు తమ డిమాండ్ల సాధన కోసం మహాధర్నా చేస్తున్నట్లు ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావుకు వినతిపత్రం అందించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు తమకు కనీస వేతనం రూ.26 వేలు పెంచాలని తదితర డిమాండ్ల సాధనకై గురువారం విజయవాడలో జరిగే మహాధర్నాకు హాజరవుతామని ఎంపీడీవోకు ఫీల్డ్ అసిస్టెంట్లు వినతి పత్రం అందించారు.

పార్టీ వీడి వెళ్ళిన వారంతా తిరిగి కాంగ్రెస్‌లోకి

● జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు

బాపట్ల, జనవరి 3 : కాంగ్రెస్ పార్టీని వీడి వెళ్లిన వారందరిని తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా అంజిబాబు తెలిపారు. బుధవారం జోగి సురేష్‌బాబు, జోగి విట్సన్‌పాల్, బోరుగడ్డ జార్జిపాల్, అక్బర్‌బాషా, దాసరి నాగబాబు, కె.నవీన్‌లు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వీరికి అంజిబాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


సావిత్రిబాయిపూలే దంపతుల విగ్రహాలకు పుష్పాంజలి ఘటిస్తున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు తదితరులు

సావిత్రిబాయిపూలేకు ఘన నివాళి

బాపట్ల, జనవరి 3 : భారతదేశ తొలిమహిళా ఉపాధ్యాయని సావిత్రిబాయిపూలే జయంతి కార్యక్రమాన్ని బహుజన సమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. మండలపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో పూలే దంపతుల విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కె.వినయ్‌రాజు సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు మాట్లాడుతూ భారతీయ సంఘసంస్కర్త, ఉపాధ్యాయిని, రచయత్రి సావిత్రిబాయిపూలే పేదవర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గడ్డం ఏలియా, ఎం.ఝాన్సీ, గుదే రాజారావు, పరైె కోటయ్య, దాసరి లక్ష్మీ, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు. బీసీ బడుగు బలహీనవర్గాల సంక్షేమ సంఘం, బీసీ సంక్షేమ సంఘం, జనసేన పార్టీ ఆధ్వర్యంలో పలు చోట్ల సావిత్రీబాయి జయంతి నిర్వహించారు.

● బాపట్ల టౌన్, జనవరి 3: ఆధునిక విద్యతోనే మహిళాభ్యున్నతి సాధ్యమని భావించిన సావిత్రిబాయిపూలే బలహీనవర్గాల ప్రజల అభున్నతి కోసం, స్త్రీవిద్య కోసం అహర్నిశలు పాటుపడిన సావిత్రిబాయిపూలే తరతరాలకు ఆదర్శనీయులని సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ అన్నారు. బుధవారం సావిత్రిబాయి పూలే జయంతిలో సాహితిభారతి కోశాధికారి ఆదంషఫి, ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు ఆమె సేవలను కొనియాడారు.

● రేపల్లె, జనవరి 3: నిజాంపట్నం మండలం బొర్రావారిపాలెంలో సావిత్రిబాయ్ పూలే జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు పాల్గొన్నా రు. సావిత్రిబాయ్ పూలే జీవితం నేటి మహిళా లోకానికి ఆదర్శనీయమని జైభీమ్ భారత్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు దోవ రమేష్‌రాంజీ అన్నారు.

● భట్టిప్రోలు, జనవరి 3 : మండలంలోని ఐలవరంలో బుధవారం సావిత్రీబాయి పూలే చిత్రపటానికిబీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ నివాళులర్పించారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

● యూటీఎఫ్ రాష్ట్రాధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు


కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

బాపట్ల, జనవరి 3 : రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్రాధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం పక్కనే క్రీడా వికాస కేంద్రం దగ్గర ఉప్పరపాలెం రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు జె.వినయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ జీతాల కోసమే వచ్చే సొమ్ము అంతా ఖర్చవుతుందని ప్రభుత్వం ప్రకటన చేయటం సరికాదన్నారు. ప్రజలు ఎన్నిరకాల పన్నులు కడుతున్నారు, వారికి ఇచ్చేది ఎంత, జీతాలకు ఇచ్చేది ఎంతో, ప్రజాప్రతినిధులకి ఇచ్చే ఖర్చుఎంతో వీటిన్నిటి మీద ఒక సమగ్ర రిపోర్ట్‌ను రాష్ట్ర ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా బకాయిలు వెంటనే చెల్లించి 1వ తేదీన వేతనాలివ్వాలన్నారు. స్పందించకపోతే విజయవాడలో 9, 10 తేదీల్లో 36 గంటల ధర్నాను నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు పాపారావు, ఉపాధ్యక్షుడు బిక్షాలుబాబు, హరిప్రియ, కోశాధికారి వెంకటేశ్వరరెడ్డి, జనవిజ్ఞానవేదిక రాష్ట్రప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు, మండలఅధ్యక్ష, కార్యదర్శులు 400మందికిపైగా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సావిత్రిబాయిపూలే విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. వంటావార్పు చేసి నిరసన తెలిపారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరించాలి

సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించాలని నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఉద్యోగులు చేస్తున్న సమ్మె బుధవారం 15వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట చేస్తున్న ఆందోళన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మెకు యూటీఎఫ్ సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మణి, కార్య దర్శి సీహెచ్ మజుందార్, జిల్లా నాయకులు తిరుమలరెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జె.వినయ్‌కుమార్, బాపట్ల, నగరం, అద్దంకి, అమర్తలూరు, నిజాంపట్నం, కొల్లూరు, చీరాల, వేటపాలెం తదితర మండలాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

పేద కుటుంబాలకు అండగా ప్రభుత్వం : కలెక్టర్


లబ్ధిదారులకు మెగా చెక్ అందజేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే కోన

బాపట్ల, బాపట్ల రూరల్, జనవరి 3: పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. వైఎస్సార్ పింఛను కానుక కింద రూ.2,750లు నుంచి 3వేలకు పెరిగిన పింఛను నగదు పంపిణీ జిల్లా స్థాయి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో లాంఛనంగా ప్రారంభించారు. పేదల ప్రభుత్వమే మనదని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. డీఆర్‌డీఏ పీడీ బి.అర్జునరావు పాల్గొన్నారు. బాపట్ల మండలం ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పెన్షన్ పెంపుదల ఉత్సవాల్లో రఘుపతి ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారుల కు పెన్షన్ నగదును పంపిణీ చేశారు.

22వ తేదీన ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్

ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్ జనవరి 22న జిల్లాలో ప్రకటిస్తామని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం రాజకీయపార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. జిల్లాలో ఓటర్ల నమోదు, మార్పుల కోసం ఇప్పటివరకు 1,84,258 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించినట్లు చెప్పారు. ఫారం-6,7,8లు కలిపి 417 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. డీఆర్వో వెంకటరమణ, రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జన్‌బాగిధరి కార్యక్రమాలు జయప్రదం చేయాలి : జేసీ

బాపట్ల, జనవరి 3 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ పురస్కరించుకొని జన్‌భాగిధరి కార్యక్రమాలను జిల్లాలో జయప్ర దంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. జన్‌భాగిధరి కార్యక్రమాల నిర్వహణపై జిల్లా స్థాయి కమిటీ తొలి సమావేశం కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో బుధవారం జరిగింది. విజయవాడలోని స్వరాజ్ మైదాన్‌లో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఈనెల 19వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని చెప్పారు. 4వ తేది నుంచి 8వ తేది వరకు పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు డ్రాయింగ్, డిబెట్, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించాలన్నారు. 7 నుంచి 11వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో అంబేద్కర్ చిత్రపటాలు, విగ్రహాలను ఆవిష్కరించాలన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ సాధికార అధికారి రాజాదెబోరా, డీఈవో రామారావు, డీఆర్ డీఏ పీడీ కృష్ణ, మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోలీసు పికెటింగ్

కొల్లూరు, జనవరి 3 : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా తోకలవానిపాలెం, కిష్కిందపాలెం గ్రామాల మధ్య జరిగిన ఘర్షణ కారణంగా పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ రాజ్యలక్ష్మి బుధవారం పేర్కొన్నారు. డీఎస్పీ రెండు గ్రామాల పెద్దలతో గురువారం చర్చించి సమస్య పరిష్కరిస్తారని, అప్పటి వరకు పోలీసు పికెటింగ్ కొనసాగుతుందని ఎస్ఐ తెలిపారు.

ఉచిత బస్సు సౌకర్యం వల్ల కార్మికులకు నష్టం

● ఎమ్మెల్యే కోనకు ఆటోడ్రైవర్ల వినతి

బాపట్ల, జనవరి 3 : మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించటం వల్ల ఆటో కార్మికులకు నష్టం కలుగుతుందని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 లక్షల మంది ఆటోడ్రైవర్లు ఉపాధి కోల్పోతారని బాపట్ల జిల్లా ఆటోడ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే కోన రఘుపతికి వినతిపత్రం అందజేశారు. ఇటువంటి హామీపై సమీక్ష జరపాలని కోరారు. పెరిగిన పెట్రోల్, డీజీల్ ధరలతో ఇప్పటికే ఆటోడ్రైవర్లు అనేకమంది ఇబ్బందులు పడుతున్నారని ఈ పథకం వల్ల భవిష్యత్తులో వారి ఉపాధికి ఇబ్బందిగామారుతుందని వివరించారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి ఎన్నికల హామీగా ప్రకటించకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వెల్లటూరులో అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర

భట్టిప్రోలు, జనవరి 3 : శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ద్వారా వచ్చిన అయోధ్య బాలరాముని అక్షింతల శోభాయాత్ర సమరసత సేవా ఫౌండేషన్ రేపల్లె సబ్‌డివిజన్ కన్వీనర్ క్రాప రవికుమార్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని వెల్లటూరులో నిర్వహించారు. గ్రామ ప్రధాన వీధుల్లో నుంచి రామాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. చెన్నకేశవస్వామి దేవస్థానంలో స్వయం గా పసుపు కొమ్ములు కట్టి స్వచ్ఛమైన ఆవునెయ్యితో అక్షింతల స్పర్శ కార్యక్రమం ద్వారా సంయోగం చేసి ఇంటింటికి చేర్చే విధంగా మహిళలు సిద్ధం చేసుకున్నారు.

వైద్యశాల నిర్మాణ పనులు పరిశీ లన

వేమూరు, జనవరి 3: వేమూరులో రూ.8 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు పూర్తి చేసుకుంటున్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను బుధవారం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సందర్శించారు. పనుల్లో నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీపీ మోహన్‌రావు, యార్డు మాజీ చైర్మన్ ఏడుకొండలు, పలువురు అధికారులు, వైసీపీ నేతలు పాల్గొన్నారు.



అద్దంకిలో బోర్లా పడుకుని దండం పెడుతూ నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కార్మికుల పొట్టగొట్టే విధానాలను మానుకోవాలి

అద్దంకిటౌన్, జనవరి 3: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు వారి డిమాండ్ల సాధనకోసం సమ్మె చేస్తుంటే సమ్మెను నిరుగార్చేలా కూలీలతో పారిశుధ్య పనులు చేయిస్తూ కార్మికులు పొట్టగొట్టే విధానాలను ప్రభుత్వం మానుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె బుధవారానికి 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో కార్మికులు బోర్లాపడుకుని, దండం పెడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పెనుబాక ఆదాము, గాలి బీష్మా, బత్తుల కృష్ణ, దాసరి వీరయ్య, యర్రమోతు సుబ్బయ్య, మాలెపోగు అంజమ్మ, దాసరి అలివేలు పాల్గొన్నారు.



ఒంటి కాలుపై నిల్చొని నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ఒంటి కాలుపై నిల్చొని పారిశుధ్య కార్మికుల నిరసన

చీరాల, జనవరి 3: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె, నిరసన కార్యక్రమాలు రోజు, రోజుకు ఊపందుకుంటున్నాయి.ఆ క్రమంలో బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న దీక్ష శిబిరంలో పారిశుధ్య కార్మికులు ఒంటికాలుపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారికి మద్దతుగా పాల్గొన్న సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఎన్. బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరి వీడకుంటే, వారి కళ్ల తెరిపించేవరకు ఉద్యమం, సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, వారి మద్దతుదారులు పాల్గొన్నారు.



వాహనాలలో విజయవాడకు తరలివెళ్తున్న భవానీ దీక్షాధారులు

భవానీల ఇరుముడుల కార్యక్రమం


చినగంజాం, జనవరి 3 : మండలంలోని పల్లెపాలెం, మహాలక్ష్మి కాలనీలలో భవానీల ఇరుముడుల కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. పల్లెపాలెం గ్రామంలోని రామాలయంలో గ్రామానికి చెందిన 24 మంది భవానీలు, చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మి కాలనీకి చెందిన 10 మంది భవానీలకు మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గురుభవానీ సైకం ఏడుకొండలు ఆధ్వర్యంలో ఇరుముడుల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రామాలయం, మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 41 రోజులు కనకదుర్గా అమ్మవారి దీక్ష పూర్తి చేసుకొని, అమ్మవారికి ఇరుముడులు చెల్లించుకునేందుకు 34 మంది భవానీలు పలు వాహనాల్లో విజయవాడ బయలుదేరి వెళ్లారు. భవానీలకు కుటుంబసభ్యులు, బంధువులు వీడ్కోలు పలికారు.



టీఎన్ఎస్ఎఫ్ అద్దంకి నియోజకవర్గ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

టీఎన్ఎస్ఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

అద్దంకిటౌన్, జనవరి 3: టీఎన్ఎస్ఎఫ్ అద్దంకి నియోజకవర్గ నూతన సంవత్సర క్యాలెండర్‌ను అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్ బుధవారం చిలకలూరిపేటలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై టీఎన్ఎస్ఎఫ్ పోరాడి వారి సమస్యల పరిష్కారానికి విద్యార్థులతో కలిసి కృషి చేయాలని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. అనంతరం నియోజకవర్గ ప్రజలకు, విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నియోజవర్గ ప్రెసిడెంట్ ముట్లూరి మహేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి శ్రావణ్, ఉపాధ్యక్షుడు రాజా, కార్యదర్శి ఎస్‌కె.పర్విజ్ అన్వర్, బొంతు ఏసుబాబు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



ముక్తేశ్వరం ప్రాథమికోన్నత పాఠశాలలో గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టిన మోటారు పైపులు

ముక్తేశ్వరం పాఠశాలలో వాటర్ పైపులు ధ్వంసం

బల్లికురవ. జనవరి 3 : మండలంలోని ముక్తేశ్వరం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గేటు తాళాలు పగులగొట్టి వాటర్ పైపులైన్‌ను ధ్వంసం చేశారు. బుధవారం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు పైపులైన్ పగులగొట్టి ఉండటాన్ని గమనించి వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలోకి వచ్చేందుకు గేటు తాళాలు పగలగొట్టి లోపల తరగతి గదుల తాళాలు పగల గొట్టేందుకు యత్నించి చోరీకి విఫల యత్నం చేశారని, చివరకు బోరు బావిలో ఉన్న మోటర్‌ను తస్కరించేందుకు పైపులను కోసి వేశారని, ప్రజల అలికిడితో పరారై ఉంటారని గ్రామస్థులు తెలిపారు. పాఠశాలలో విలువైన వస్తువులు ఉన్నాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిబాబు తెలిపారు. పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ చిరంజీవి పాఠశాలలో జరిగిన ఘటనపై పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు.

వైసీపీ కుట్రలను సమర్థంగా ఎదుర్కోవాలి

అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్



మార్టూరు సమీపంలోని జొన్నతాళిలో మణికేశ్వరం, శింగరకొండపాలెం టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకిటౌన్, జనవరి 3: అధికార పార్టీ చేస్తున్న కుట్రలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయిలో టీడీపీ నాయకులు, ఓటర్లు, ప్రజలు తమవంతుగా కృషి చేయాలని అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్ సూచించారు. బుధవారం మార్టూరు సమీపంలోని జొన్నతాళిలో మండలంలోని మణికేశ్వరం, శింగరకొండపాలెం గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవల్ ఏజెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలను ఆయా గ్రామాల నాయకులు , కార్యకర్తలకు సూచించారు. ఓటరు పేజీ నేస్తం పేరుతో 60 మంది ఓటర్లకు ఒ కరిని సెక్షన్ ఇన్‌చార్జిగా 6 మంది ప్రతి నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ క్రియాశీలకంగా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా ఓటరు పేజికి నేస్తంగా 23 మందిని ఎంపిక చేయడం పట్ల అభినందించారు. టీడీపీ అధికారంలోకి రాగానే అమ్మకు వందనం పేరుతో ఇంటిలో ఎంత మంది విద్యార్థులు ఉన్నా వారందరికి సంవత్సరానికి రూ. 15 వేలు, యువగళం నిధికింద యువతకు నెలకు రూ. 3 వేలు, ప్రతి రైతుకు రూ. 20వేలు ఆర్థిక సాయం, బీసీలకు రక్షణ చట్టం, దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహాశక్తి కింద 18 నుంచి 59 సంవత్సరాల ప్రతి మహిళలకు 1500 రూపాయలు అందజేత పథకాలను ఇంటింటికీ తిరుగుతూ ప్రజలలోకి తీసుకువెళ్ళాలని సూచించారు. అలాగే ఓటరు జాబితాలపై ఎప్పటికప్పుడు అందరు అప్రమత్తంగా ఉండాలని, అందరం కలిసి కట్టుగా పనిచేసి పార్టీ అధికారంలోకి రావడానికి అందరం ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యా గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయా హోదాలు కలిగిని టీడీపీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో సెయింట్ ఆన్స్‌లో ముగ్గుల పోటీలు

చీరాల, జనవరి 3 : ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు .. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన వారు సంయుక్తంగా సెయింట్ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్న ముత్యాల ముగ్గులు పోటీలు శుక్రవారం ఉదయం 9 గంటలకు సెయింట్ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల(అటానమస్)లో జరుగుతున్నాయి. ఈ పోటీలలో పాల్గొన దలచిన వారు ముందస్తుగా ఆంధ్రజ్యోతి దినపత్రికలో వస్తున్న ప్రకటనలోని ఫోన్ నెంబర్లకు తమ పేరు, చిరునామాతో రిజిస్టర్ చేసుకోవాలి. పోటీలలో పాల్గొన్న వారికి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు అందించనున్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతి ఇస్తామన్నారు. 5వ తేదీ శుక్రవారం జరిగే ఈ పోటీలకు హాజరయ్యే మహిళలు సెయింట్ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల బస్సులలో కాలేజికి రావచ్చు. స్థానిక రైల్వేస్టేషన్, బస్టాండ్ కూడలి, పేరాల కూడలి, నల్లగాంధీబొమ్మ కూడలి , కొత్తపేట కూడలి కళాశాల బస్సులలో ఎక్కి రావచ్చు. అలానే పోటీల అనంతరం పోటీలలో పాల్గొనేందుకు వచ్చిన మహిళలను తిరిగి వారు ఎక్కిన ప్రదేశాల్లో దింపే సౌకర్యం కల్పిస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీలలో పాల్గొనే మహిళలు అందుకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్వాహకులు సూచిస్తున్నారు. పేర్ల రిజిస్ట్రేషన్‌కు, ఇతర వివరాలకు సెల్ నెంబర్లు 99490 73369, 93903 07829, 99854 11491 నెంబర్లలో సంప్రదించగలరు

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



చీరాల టీడీపీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కొండయ్య

అద్దంకిటౌన్, జనవరి 3: సావిత్రీబాయి పూలే కృషి వలన సాంఘిక దురాచారాలకు బలికాకుండా ఎందరో బాలికలు చదువుకుంటున్నారని, మరెందరో మహిళలు ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారని పలువురు వక్తలు అన్నారు. భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలే 193వ జయంతి సందర్భంగా పలు పాఠశాలల్లో, వివిధ సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శింగరకొండ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ కార్యాలయంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం అధ్యక్ష, కార్యదర్శులు మలాది శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, ట్రెజరర్ భువనేశ్వరి, మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యు. దేవపాలన ముఖ్య అతిథిగా హాజరై సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీలోని ఎంపీపీ స్కూల్‌లో హెచ్ఎం కోటా అంజమ్మ ఆధ్వర్యంలో సావిత్రీబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్ళులర్పించారు. మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొని సావిత్రీబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో..

బీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేడ్కర్ భవనంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, బీఎస్పీ నియోజకవర్గ నాయకులు మందా జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

చీరాల టీడీపీ కార్యాలయంలో

చీరాల : స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడులను ఘనంగా నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.ఎం కొండయ్య సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పర్చూరులో సావిత్రిబాయ్ పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘ నేతలు

ఆదర్శ మహిళ సావిత్రిబాయ్ పూలే

పర్చూరు, : బడుగు బలహీన దళిత మైనార్టీ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా విద్యను బోధించిన సావిత్రి బాయ్ పూలే కృషి యనలేనిదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవి కుమార్ పేర్కొన్నారు. బుధవారం పర్చూరు బొమ్మల సెంటర్‌లో సావిత్రిబాయ్ పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జన్నదుల వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎస్ఎస్‌పీ రాజు, బంకా మాధవరావు, కారుమంచి రామాంజనేయులు, అంగలకుదురు నటరాజన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం



సావిత్రి బాయిపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చినగంజాం, జనవరి 3 : మండలంలోని పలు పాఠశాలల్లో భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయరాలైన సావిత్రిబాయిపూలే 193వ జయంతిని పురస్కరించుకుని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయిపూలే జయంతిని పురస్కరించుకొని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాలల్లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్.ఎంలు కుర్రా రామారావు, మల్లారెడ్డిలు మాట్లాడుతూ ప్రతి వద్యార్థి సావిత్రిబాబు పూలేని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు. దేశ మొదటి మహిళా ఉపాధ్యాయుని, రచయిత, సంఘ సంస్కర్త అయిన సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా గౌరవిస్తున్నారని అన్నారు. మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాల మహిళా ఉపాధ్యాయురాలైన పి.హిమవంతేశ్వరిని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు ఎస్.నాగమల్లేశ్వరరావు, ఎన్.చంద్రశేఖర్, సీ.హెచ్. హెలెన్‌రూత్, కే.రామారావు, పూజా కవిత, ఎస్.ప్రసాద్, షేక్.జరీనాతాజ్, ఎస్‌వీ.శివయ్య, ఎస్.త్రిపురాంతకరావు, సంపతమ్మ, వెన్నెల, అరుంకుమార్, పి.లక్ష్మి, పీ.డీ.జే.దేవభిక్షం, విద్యార్థులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరేందుకు విజయవాడ తరలివెళ్తున్న వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తల వాహనాలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కొండయ్య

చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి ... అదే మన నినాదం

- **టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.ఎం కొండయ్య**

చీరాల, జనవరి 3 : వచ్చే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు గెలిసి చంద్రబాబు మరలా ముఖ్యమంత్రి కావాలని అదే మన నినాదమని, అందుకు కార్యోన్ముఖులమై పనిచేద్దామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.ఎం కొండయ్య పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి బుధవారం వివిధ పార్టీల నుంచి టీడీపీలోకి చేరేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలతో కొండయ్య మాట్లాడారు. అనంతరం చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరేందుకు వచ్చిన వారు ప్రత్యేక బస్సుల్లో తాడేపల్లికి బయలుదేరేందుకు కొండయ్య వారికి అన్ని వసతులు కల్పించి బస్సు ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

అద్దంకిటౌన్, జనవరి 3: ప్రస్తుతం ఉన్న అద్దంకి నియోజవర్గం, 2024 తరువాత నియోజకవర్గాన్ని నేను ఏవిధంగా అభివృద్ధి చేస్తానో ప్రజలందరు చూడాలని వైసీపీ అద్దంకి ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి అన్నారు. బుధవారం అద్దంకి మున్సిపల్ కార్యాలయం వద్ద వైఎస్ఆర్ పెన్షన్ కానుకలో భాగంగా నూతనంగా మంజూరు అయిన పెన్షన్లను ఆయన పంపిణీ చేశారు.ముందుగా సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆ మె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో హనిమిరెడ్డి మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఏస్తేరమ్మ, కమిషనర్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే బలరాం



లబ్ధిదారులకు పెన్షన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బలరాం

చీరాల, జనవరి 3 : ప్రభుత్వ పరంగా అందిస్తున్న పెన్షన్లను, ప్రభుత్వ సా యాన్ని లబ్ధిదారులు సద్వి నియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తి అన్నారు. స్థానిక ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో బుధవారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరాం, ఆర్డీవో సరోజిని తదితరులు మాట్లాడుతూ దశల వారీగా పెన్షన్ పెంపునకు చేపట్టిన ప్రభుత్వ విధానాన్ని, సీఎం జగన్ చర్యలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్లు బొనిగల జైసన్ బాబు, శిఖాకొల్లి రామసుబ్బులు, పలువురు కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వఉంచిన రేషన్ బియ్యం పట్టివేత



పట్టుపడ్డ రేషన్ బియ్యంతో అధికారులు

కారంచేడు(పర్చూరు), జనవరి 3: కారంచేడు గ్రామంలోని షాపు నెంబరు 3లో అక్రమంగా నిల్వఉంచిన 24 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని అధికారులు బుధవారం పట్టుకున్నారు. బియ్యం అక్రమంగా నిల్వఉందన్న సమాచారంతో బాపట్ల జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. రేషన్ దుకాణంలో అక్రమంగా నిల్వఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకొని షాపు యజమానిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు పౌరసరఫరాలశాఖ డీటీ ఓంకార్ తెలిపారు. దీంతోపాటు బియ్యాన్ని తరలించేందుకు దుకాణం వద్ద ఉంచిన వాహనాన్ని కూడా సీజ్‌చేసినట్లు అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో డీటీ అనిత, ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ కిషోర్, వీఆర్వో విమోచన పాల్గొన్నారు.

కూలీలకు గ్రామాలలోనే పనులు కల్పించాలి



ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో బ్రహ్మయ్య

బల్లికురవ. జనవరి 3 : రోజువారీ కూలీలు గ్రామాల నుంచి వలస పోకుండా పనులు కల్పించాలని ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్య కోరారు. బుధవారం బల్లికురవ డ్వామా కార్యాలయంలో అన్ని గ్రామాల ఉపాధి హామీ పథక సిబ్బందితో సమీక్షా సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ ఏడాది గ్రామాలలో ఉపాధి పనులను గుర్తించాలని, కూలీలకు వంద రోజుల పని దినాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో ఏపీవో బాలకృష్ణనాయక్ తదితరులు ఉన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న వన్‌టౌన్ ఎస్సై జానీబాషా

కొత్తపాలెం(చీరాలటౌన్), జనవరి 3 : మనస్తాపంతో వ్యక్తి ఆత్మహతకుఉపాల్పడిన ఘటన బుధవారం చీరాల మండల పరిధిలోని కొత్తపాలెంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జెర్రిపోగు సంసోన్(48)కు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. సంసోన్ బేల్దారి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతకొంత కాలంగా మద్యానికి బానిసగా మారాడు. ఈక్రమంలో కుటుంబంలో మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. దీంతో ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ ఎస్సై జానీబాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రానైట్ క్వారీలలో ముడిరాళ్లకు నంబర్లు కేటాయింపు

బల్లికురవ. జనవరి 3 : మండల పరిధిలోని వీర్ల కొండ వద్ద గల పలు గ్రానైట్ క్వారీలను బుధవారం బాపట్ల జిల్లా మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా వారు క్వారీలలో వెలికి తీసిన ముడిరాళ్ల అక్రమ మార్గంలో తరలించకుండా ఉండేందుకు యూడీటీ నెంబర్లను కేటాయించారు. సత్యకృష్ణ, ఇంపీరియల్, శ్రీనివాస, ఎస్ఆర్ గ్రానైట్ క్వారీలలో ఉన్న ముడిరాళ్లను పరిశీలించి అన్ని రాళ్లకు నెంబర్లను కేటాయించారు. అన్ని క్వారీలలో ఇదే పద్ధతి కొనసాగించేలా మైనింగ్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. గతంలో లేని పద్ధతిని అమలు చేయటం పట్ల పలువురు గ్రానైట్ క్వారీల యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టరేట్ ముట్టడికి భారీగా వెళ్లిన అంగన్‌వాడీలు



వాహనంలో బాపట్లకు తరలివెళుతున్న అంగన్‌వాడీలు

అద్దంకిటౌన్, జనవరి 3: సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు బుధవారం ఉదయాన్నే బాపట్ల జిల్లా కలెక్టరేట్ ముట్టడికి ప్రత్యేక వాహనాలలో తరలివెళ్ళారు. ఐసీడీఎస్ కొరిశపాడు ప్రాజెక్టు పరిధిలోని అద్దంకి, కొరిశపాడు, పంగులూరు మండలాల నుంచి అంగన్‌వాడీలు, ఆయాలు తరలి వెళ్లారు.

బల్లికురవ నుంచి

బల్లికురవ : నిరవధిక సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం బాపట్ల జిల్లా కలెక్టరేట్ ముట్టడికి తరలి వెళ్లారు. తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని వారు రోజుకో రకంగా నిరసనలు తెలియజేస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు గురిచేసినా తాము తగ్గేది లేదని అంగన్ వాడీ కార్యకర్తలు తెలిపారు. తరలి వెళ్లిన వారిలో సంఘ నేతలు నాగమణి, సునంద, నిర్మల, శివ పావని, వెంకటరమణ, చిన్నమ్మాయి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం

- కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం



శామ్యూల్ మోజెస్‌తో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

చీరాల, జనవరి 3: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని, అందుకు భావసారూప్యత ఉన్న అందరిని కలుపపోదామని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం అన్నారు. స్థానికంగా బుధవారం నియోజకవర్గంలో ఆయన పలువురిని కలిశారు. అందులో భాగంగా గతంలో కాంగ్రెస్ పార్టీ క్రియాశీలక కార్యకర్త, ప్రస్తుతం వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నీలం శామ్యూల్ మోజెస్‌ను శీలం కలిశారు. అందులో భాగంగా రాజకీయంగా పలు అంశాలపై చర్చించారు. ఆ క్రమంలో దళిత క్రైస్తవులు, చీరాల నియోజకవర్గంలో వారికున్న ప్రాధాన్యత, ఓట్లు, ప్రాధాన్యత సరళి తదితర అంశాలపై చర్చించారు. ఈ క్రమంలో శీలం కాంగ్రెస్ పార్టీలో పునఃప్రవేశం చేయాలని మోజెస్‌కు ప్రతిపాదించగా అందుకు తన వర్గీయుల అందిరితో మాట్లాడుకుని అంతిమ నిర్ణయం వారం, పది రోజుల్లో చెప్తానని చెప్పినట్లు తెలిసింది.

వైసీపీ ప్రభుత్వానికివే చివరి రోజులు

పూనూరులో టీడీపీ కార్యాలయ ప్రారంభంలో ఎమ్మెల్యే ఏలూరి



పూనూరులో బుధవారం రాత్రి టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

యద్దనపూడి(మార్టూరు), జనవరి 3 : జగన్ వ్యక్తిగత పాలన సాగిస్తున్నారని, ఇక వైసీపీ ప్రభుత్వానికి ఇవే చివరి రోజులని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని పూనూరు గ్రామంలో టీడీపీ నూతన కార్యాలయాన్ని బుధవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షులు రంగయ్యచౌదరి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్‌ను వైసీపీ కాల రాసిందని ధ్వజమెత్తారు. కోటి ఆశలతో ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి అధికారంఇస్తే అక్రమ సంపాదన కోసం వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేసి అధికారాన్ని దుర్వినియోగం చేశారని, ఇసుక, మద్యం, బియ్యం దోపిడీ మొదలుకొని ఖనిజ సంపాదన దోచుకుంటున్నారని విమర్శించారు. టీడీపీ పాలనలో రైతులకు స్వర్ణ యుగంలా మారిందని, వైసీపీ పాలనలో రైతులకు సాగునీరు అందని దుస్థితి నెలకొంది అన్నారు. నేడు వైసీపీ పాలనలో ప్రజలు వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. ఆరు నెలల్లో పట్టిసీమ ప్రాజెక్టును పూర్తి చేసి చివరి భూములకు సైతం అద్భుతంగా నీరు అందించిన ఘనత టీడీపీదేనని అన్నారు. తొలుత విఘ్నేశ్వర వేణుగోపాల స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు బోయపాటి సాంబయ్య, సీనియర్ నాయకులు రావిపాటి సీతయ్య, భత్తుల రాము, వీరపనేని వాసు, తల్లపునేని సుధాకర్, ఈదల అనిల్, బత్తుల కృష్ణవేణి, వంకాయలపాటి సుబ్బారావు, పావులూరి శివాజీ, నాగేశ్వరరావు, తారక రామారావు, సతీష్, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.